వాయిస్ ఆఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
TGTEL/25/A2649
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10
శుక్రవారం, జనవరి 30, 2026
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## 11 మంది సైబర్ నేరగాళ్లకు చైనా ఉరి



బీజింగ్: మయన్మార్‌లోని ఆన్‌లైన్ స్కామ్ సెంటర్లతో సంబంధం కలిగి ఉన్న 11 మందిని చైనా ఉరి తీసింది. తమ దేశ పౌరులను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న మోసాలపై ఈ మేరకు కఠిన చర్యలు తీసుకున్నది. ఇదే కేసులో మరో 23 మంది అనుమానితులకు ఐదేండ్లు మొదలుకొని జీవిత ఖైదు వరకు జైలు శిక్ష విధించింది. 'ఉద్దేశపూర్వక హత్యలు, గాయపరచడం, చట్టవిరుద్ధ నిర్బంధం, మోసం, జూద గృహాల స్థాపన వంటి నేరాలను పరిగణనలోకి తీసుకొని దోషులకు ఉరి శిక్ష అమలైంది' అని చైనా ప్రభుత్వ మీడియా తెలిపింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు

# కేసీఆర్‌కు సిట్ నోటీసు



- మాజీ సీఎంను విచారణకు పిలిచిన ప్రత్యేక దర్యాప్తు బృందం
- మున్సిపల్ ఎన్నికల బిజీలో గడువు కోరిన కేసీఆర్
- ఎర్రవల్లిలోనే విచారణకు అనుమతి కోరుతూ విజ్ఞప్తి
- ప్రభాకర్‌రావు పునర్నియామకమే ప్రధాన అంకం
- ఇప్పటికే కీలక నేతల వాంగ్మూలాలు నమోదు

హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో దర్యాప్తు సాగిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసు జారీ చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 160 సీఆర్పీసీ కింద జారీ చేసిన ఈ నోటీసులో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని సిట్ సూచించింది. అయితే మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో పూర్తిగా నిమగ్నమై ఉన్నానని పేర్కొంటూ మరో తేదీ ఇవ్వాలని కేసీఆర్ కోరారు. ఈ అభ్యర్థనకు సిట్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శుక్రవారమే రెండో విడత నోటీసు జారీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఈ వ్యవహారం చుట్టూ పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో 2024 మార్చి 10న నమోదు చేసిన క్రైమ్ నంబర్ 243/2024 కేసులో విచారణ నిమిత్తం సిట్ అధికారులు కేసీఆర్‌కు నోటీసులు పంపారు. దర్యాప్తు అధికారి పి. వెంకటగిరి ఈ మేరకు విచారణకు రావాలని సూచించారు. 65 ఏళ్లు దాటిన వ్యక్తిగా పోలీస్‌స్టేషన్‌కు తప్పనిసరిగా రావాల్సిన అవసరం లేదని నోటీసులో పేర్కొన్నారు. అవసరమైతే జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛందంగా హాజరు కావచ్చని, లేదంటే హైదరాబాద్ నగర పరిధిలో ఇతర ప్రదేశాన్ని సూచించవచ్చని తెలిపారు.

నోటీసు అందజేయడానికి సిట్ అధికారులు బంజారాహిల్స్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి వెళ్లారు. ఆ సమయంలో ఆయన అక్కడ లేకపోవడంతో ఇంటి సిబ్బందికి నోటీసు అందించారు. మొదట ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు సిట్ బృందం వెళ్లిందన్న ప్రచారం జరిగినా, అధికారులు మాత్రం నందినగర్‌లోనే నోటీసు ఇచ్చినట్లు స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా కేసీఆర్‌ను విచారించేందుకు సిట్ ఇప్పటికే విస్తృత ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు తెలిసింది. ప్రధానంగా ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు పదవీ విరమణ అనంతరం పునర్నియామకానికి సంబంధించిన ఫైళ్లే దర్యాప్తులో కీలకంగా మారినట్లు సమాచారం. విశ్రాంతి తీసుకున్న అధికారిని ఇంటెలిజెన్స్ విభాగంలో ఓఎస్డీగా నియమించడం వెనుక ఉన్న కారణాలే ఫోన్ ట్యాపింగ్‌కు దారితీసిన అంశమని సిట్ భావిస్తోంది. ఈ నిర్ణయం ఎవరి అవసరానికి తీసుకున్నదన్న దానిపై స్పష్టత సాధించడమే దర్యాప్తు లక్ష్యంగా తెలుస్తోంది.

ఈ కేసులో ఇప్పటికే కేసీఆర్ మాజీ ఓఎస్డీ రాజశేఖర్‌రెడ్డి, అప్పటి సీఎస్, డీజీపీ, ఇంటెలిజెన్స్ విభాగాధిపతి సహా పలువురు ఉన్నతాధికారుల వాంగ్మూలాలను సిట్ నమోదు చేసింది. మావోయిస్టులతో ఎలాంటి సంబంధం లేని వందలాది ఫోన్లపై నిఘా పెట్టాల్సిన అవసరం ఎందుకు వచ్చిందన్న కోణంలో ప్రభాకర్‌రావును పలు దఫాలుగా ప్రశ్నించింది. ప్రారంభంలో స్పష్టమైన సమాధానాలు రాకపోయినా, గత నెల రెండు వారాల కస్టోడియల్ విచారణలో కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది.

అదే క్రమంలో రాధాకిషన్‌రావు విచారణ సమయంలో 'పెద్దాయన' నుంచి ఆదేశాలు వచ్చేవని పేర్కొనడం, తాజాగా మాజీ ఎంపీ సంతోష్‌రావు విచారణకు హాజరుకావడం వంటి అంశాలు కేసును మరింత కీలక దశకు తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో సిట్ ఇప్పటివరకు సేకరించిన

(మిగతా 2వ పేజీలో)

# వరాల తల్లి ఆగమనం

## చిలకలగుట్ట నుంచి గద్దెల ప్రాంగణం దాకా భక్తి జలధి

- కుంకుమ భరిణె రూపంలో సమ్మక్క కొలువుతో జాతరకు ప్రాణప్రతిష్ఠ
- డోలుడప్పులతో ఉత్సవ వాతావరణం.. జయజయధ్వానాలతో దిక్కులు మార్మోగిన వేళ
- గౌరవ వందనంగా గాలిలోకి కాల్పులు.. ఉత్కంఠభరిత ఘట్టం
- జంపన్న వాగు వద్ద లక్షలాది పుణ్యస్నానాలు.. మొక్కుల వెల్లువ
- కట్టుదిట్టమైన భద్రత.. క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షణ
- నేడు గవర్నర్ దర్శనం.. ప్రముఖులతో మేడారం కళకళ



మేడారం: వరాల తల్లి సమ్మక్క రాకతో మేడారం మరోసారి ఆధ్యాత్మిక వైభవంతో ఉట్టిపడింది. గురువారం రాత్రి చిలకలగుట్టపై కుంకుమ భరిణె రూపంలో కొలువైన సమ్మక్క తల్లిని ఆదివాసీ పూజారులు సంప్రదాయ రీతుల్లో గద్దెల ప్రాంగణానికి తీసుకొచ్చి ప్రతిష్ఠించడంతో మహాజాతర నిండు రూపు దాల్చింది. అమ్మ ఆగమనంతో మేడారం అడవీ ప్రాంతమంతా భక్తి పారవశ్యంతో తళుక్కుమంది. తెల్లవారుజాము నుంచే సమ్మక్క ఆగమనానికి సంబంధించిన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తొలుత పూజారుల కుటుంబాల మహిళలు గద్దెను శుభ్రపరచి, సంప్రదాయ అలంకరణలు చేశారు. మేడారం పడమటి వైపున ఉన్న జెండా గుట్ట నుంచి పచ్చి వెదురు కర్ర రూపంలో ఉన్న వనదేవతను తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. సాయంత్రం సమయానికి ప్రధాన పూజారులు సిద్ధబోయిన జగ్గారావు, మునీందర్, వడ్డెలు కొక్కెర కృష్ణయ్య తదితరులు చిలకలగుట్టకు చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ సంప్రదాయ రీతిలో అలంకరించిన అనంతరం కుంకుమ భరిణెను భక్తుల మధ్యగా రాత్రి 10 గంటల సమయంలో గద్దెల వద్దకు తీసుకొచ్చారు. ఆ క్షణంతో మేడారంలో జాతర పూర్తి కళ సంతరించుకుంది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. చిలకలగుట్ట నుంచి గద్దెల ప్రాంగణం వరకు వెళ్లే దారి పొడవునా జనసంద్రం ఏర్పడింది. 'సమ్మక్క తల్లీడ సల్లంగ చూడమ్మ' అంటూ మార్మోగిన నినాదాలతో పరిసరాలు దద్దరిల్లాయి. మహిళలు రంగురంగుల ముగ్గులతో దారిని అలంకరించగా, ఆడపడుచులు హారతులతో స్వాగతం పలికారు. డోలు, డప్పుల శబ్దాలతో ఆదివాసీ కళాకారుల నృత్యాలు జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారిని తీసుకొచ్చే

(మిగతా 2వ పేజీలో)



### దేశంలో వీధికుక్కల సమస్య... తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు

- వీధి కుక్కల నిర్వహణ... సుప్రీంకోర్టులో విచారణ
- విచారణలో అన్ని వర్గాల వాదనలు విన్న త్రిసభ్య ధర్మాసనం
- కుక్కల స్టెరిలైజేషన్ కేంద్రాల సంఖ్యపై తప్పుడు లెక్కలున్నాయని ఆందోళన

### కేసీఆర్ కు సిట్ నోటీసులు.. కేసు విచారణ సీరియస్‌గా జరగడం లేదన్న కవిత



- రేపు కేసీఆర్‌ను విచారించనున్న సిట్ అధికారులు
- ఎన్నికలు ఉన్నందునే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారన్న కవిత
- కేసును త్వరగా ముగించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య



### హైదరాబాద్‌లో హైడ్రా కొరడా: జూబ్లీహిల్స్ 'నీరూస్'కు తాళాలు

- అగ్నిమాపక నిబంధనలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా
- జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ నీరూస్ షోరూంను సీజ్ చేసిన అధికారులు

## గెలుపు అవకాశాలున్న వారికే పార్టీ మద్దతు

- పోటీ ఎక్కువైతే చివరి క్షణంలో బీ ఫాంలు
- గాంధీభవన్‌లో కాంగ్రెస్ సన్నాహక భేటీ
- నిజామాబాద్ లోక్‌సభ పరిధి నేతలతో చర్చ
- అసంతృప్తులకు పదవుల హామీ వ్యూహం
- స్థానిక పరిస్థితుల ఆధారంగా తుది నిర్ణయం



హైదరాబాద్ : రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికను పూర్తిగా సర్వే నివేదికలు, గెలుపు సాధ్యత ఆధారంగానే చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. పోటీ అత్యంత ఉత్కంఠభరితంగా ఉన్న స్థానాల్లో నామినేషన్ల

(మిగతా 2వ పేజీలో)



## ఇది విచారణ కాదు... ప్రతీకారం
## కేసీఆర్‌కు సిట్ నోటీసులపై కేటీఆర్ ఫైర్

- కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం కక్ష సాధింపేనన్న కేటీఆర్
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే ఈ చర్యలని ఆరోపణ
- చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ తెలంగాణ సాధించారని వ్యాఖ్య
- బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరపలేరని హెచ్చరిక
- కాంగ్రెస్ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తామని ప్రకటన

## మేడిగడ్డపై ప్రమాద హెచ్చరిక

### దేశంలో అత్యంత అపాయకరంగా గుర్తించిన మూడు ఆనకట్టల్లో మేడిగడ్డ

- ఎన్‌డీఎస్‌ఏ పరిశీలనలో కేటగిరీ1గా వర్గీకరణ
- ముందస్తు భద్రత, పునరుద్ధరణ చర్యలకు స్పష్టమైన సూచనలు
- పార్లమెంట్‌లో కేంద్ర జలశక్తి శాఖ వెల్లడి
- డ్రిప్ పథకం కింద పాత డ్యాంలకు పునరావాస చర్యలు
- డ్రిప్2లో తెలంగాణకు రూ.100 కోట్ల కేటాయింపు



హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ భద్రతపై కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేసింది. దేశవ్యాప్తంగా అత్యంత ప్రమాదకర పరిస్థితిలో ఉన్న మూడు ఆనకట్టల జాబితాలో మేడిగడ్డ మొదటి స్థానంలో

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ టుడే

శుక్రవారం, జనవరి 30, 2026

# గెలుపు అవకాశాలున్న వారికే పార్టీ మద్దతు

గడువు ముగిసిన అనంతరం కూడా పరిస్థితిని సమీక్షించి, విజయావకాశాలు ఎక్కువగా ఉన్న అభ్యర్థులకు మాత్రమే పార్టీ బీ ఫాంలు జారీ చేయాలన్న అభిప్రాయానికి వచ్చినట్లు పార్టీవర్గాలు వెల్లడించాయి. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన గాంధీభవన్‌లో మున్సిపల్ ఎన్నికల సన్నాహకాలపై కీలక సమావేశం జరిగింది. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు సంబంధించి పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఇన్‌ఛార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, నిజామాబాద్ మేయర్ రామకృష్ణ, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్ తదితర సీనియర్ నేతలు సమావేశానికి హాజరయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ వ్యవహరించాలని, ఆశావహులు అధికంగా ఉన్నచోట పరిస్థితిని సర్వేలు, ఫీడ్‌బ్యాక్ ఆధారంగా అంచనా వేసి బలమైన అభ్యర్థిని బరిలో నిలపాలని నాయకులు అభిప్రాయపడ్డారు. మిగిలిన ఆశావహులను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాముల్ని చేస్తామని, అవసరమైన చోట పదవులు, బాధ్యతలు కల్పిస్తామని హామీ ఇచ్చి పోటీ నుంచి తప్పుకునేలా చూడాలన్న వ్యూహంపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. జగిత్యాల మున్సిపాలిటీ విషయంలో సీనియర్ నేత జీవన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మధ్య కొనసాగుతున్న విభేదాల నేపథ్యంలో ప్రత్యేక జాగ్రత్త అవసరమని పార్టీ భావిస్తోంది. ఈ అంశంలో ఇద్దరు నేతలు సమర్పించిన ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించి, తుది నిర్ణయం తానే స్వయంగా తీసుకుంటానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశంలో పేర్కొన్నట్లు సమాచారం. ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు సంబంధించి స్క్రీనింగ్ కమిటీల



సూచనలను పరిగణనలోకి తీసుకొని, స్థానిక రాజకీయ పరిస్థితులు, అభ్యర్థుల బలం, ప్రజాభిప్రాయం ఆధారంగా అక్కడికక్కడే అభ్యర్థులను ఖరారు చేయాలని పార్టీ నిర్ణయానికి వచ్చింది. సమష్టిగా పనిచేస్తే అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో విజయం సాధించవచ్చని నేతలు అభిప్రాయపడ్డారు. రాబోయే ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో క్లీన్‌స్వీప్ సాధించేలా క్షేత్రస్థాయిలో మరింత దూకుడుగా ముందుకెళ్లాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు.

# మేడిగడ్డపై ప్రమాద హెచ్చరిక

ఉందని స్పష్టం చేసింది. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజూరీ డ్యాం, ఝార్ఖండ్‌లోని బొకారో బ్యారేజీలు ఉన్నాయని వెల్లడించింది. డ్యాం రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్ (డ్రిప్) అమలుపై పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నలకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌధరి ఈ వివరాలను వెల్లడించారు. జాతీయ ఆనకట్టల భద్రతా పర్యవేక్షణ సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) రూపొందించిన స్పెసిఫైడ్ డ్యామ్స్ జాతీయ రిజిస్టర్2025 ప్రకారం దేశంలో 50 ఏళ్లకు పైబడిన 1681 ఆనకట్టలు నమోదైనట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రాల భాగస్వామ్యంతో చేపట్టిన సమగ్ర అధ్యయన ఫలితాలను, వాటి ఆధారంగా కేంద్రం డ్రిప్ పథకం కింద విడుదల చేస్తున్న నిధుల వివరాలను కూడా సభకు వివరించారు. 2025 వర్షాకాలానికి ముందు, తరువాత నిర్వహించిన తనిఖీల్లో మూడు బ్యారేజీలు అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్నవిగా (కేటగిరీ1) గుర్తించబడినట్లు చెప్పారు. ఈ వర్గంలోని ఆనకట్టల విషయంలో తక్షణ భద్రతా చర్యలు, నష్టనివారణ పనులు, పునరావాస కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఎన్‌డీఎస్‌ఏ సూచించినట్లు తెలిపారు. ఇదే కేటగిరీలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరిపై నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కూడా ఉందని పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీ పియర్స్ 2023 అక్టోబరులో కుంగిపోవడం తర్వాత ఈ నిర్మాణంపై భద్రతా ఆందోళనలు మరింత పెరిగాయి. తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు ఎన్‌డీఎస్‌ఏ ఈ బ్యారేజీకి సంబంధించిన నిర్మాణాలు మరింత దెబ్బతినకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించింది. నీటి నిల్వలు, వరదల ప్రభావం దృష్ట్యా ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని కూడా నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. దేశవ్యాప్తంగా పాత ఆనకట్టల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం డ్యాం సేఫ్టీ చట్టం2021ను అనుసరించి పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రాల సహకారంతో గతేడాది వర్షాకాలానికి ముందు 6524 ఆనకట్టలు, వర్షాకాలం అనంతరం 6553 ఆనకట్టలను పరిశీలించి, ఆయా రాష్ట్రాలు కేంద్రానికి నివేదికలు సమర్పించాయి. వాటి ఆధారంగా డ్యాంలను మూడు విభాగాలుగా వర్గీకరించారు. మొదటి కేటగిరీలో తీవ్రమైన లోపాలు ఉన్నవి, రెండో కేటగిరీలో గణనీయమైన లోపాలు ఉన్నవి, మూడో కేటగిరీలో చిన్నచిన్న లోపాలు ఉన్న ఆనకట్టలుగా



గుర్తించి, తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. డ్యాంల భద్రత, పునరావాస పనుల కోసం డ్రిప్ పథకం కింద కేంద్రం పదేళ్ల వ్యవధితో (20212031) ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. ఈ పథకం కింద 19 రాష్ట్రాలకు చెందిన 736 ఆనకట్టల పునరుద్ధరణ కోసం రూ.10,211 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించింది. డ్రిప్2 దశలో పలు ఆర్థిక సంస్థల సహకారంతో రూ.5,107 కోట్లు విడుదల చేయగా, డ్రిప్3 దశలో మరో రూ.5,104 కోట్లు కేటాయించినట్లు తెలిపింది. డ్రిప్2 కింద గతేడాది డిసెంబరు నాటికి రాష్ట్రాలు మొత్తం రూ.2,029 కోట్లు ఖర్చు చేశాయని కేంద్రం వివరించింది. ఇదే పథకం కింద తెలంగాణ నీటిపారుదల శాఖకు రూ.100 కోట్లు కేటాయించినట్లు అధికారికంగా పేర్కొంది.

# దేశంలో వీధికుక్కల సమస్య... తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు

**వీధి కుక్కల నిర్వహణ... సుప్రీంకోర్టులో విచారణ**

**విచారణలో అన్ని వర్గాల వాదనలు విన్న త్రిసభ్య ధర్మాసనం**

**కుక్కల స్టెరిలైజేషన్ కేంద్రాల సంఖ్యపై తప్పుడు లెక్కలున్నాయని ఆందోళన**

**కుక్కలను షెల్టర్లకు తరలించాలన్న గత ఆదేశాలను సవరించిన ధర్మాసనం**



దేశవ్యాప్తంగా వీధి కుక్కల నిర్వహణ, ప్రజల భద్రతకు సంబంధించిన సుమోటో కేసులో సుప్రీంకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ , భారత జంతు సంక్షేమ బోర్డు సహా అన్ని వర్గాల వాదనలను సుదీర్ఘంగా విన్న తర్వాత జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం గురువారం ఈ నిర్ణయం తీసుకుంది. వారం రోజుల్లోగా తమ లిఖితపూర్వక వాదనలను సమర్పించేందుకు అన్ని పక్షాలకు సమయం ఇచ్చింది. విచారణ సందర్భంగా, వీధి కుక్కల స్టెరిలైజేషన్ కేంద్రాల లెక్కల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని జంతు సంక్షేమ బోర్డు కోర్టు దృష్టికి తెచ్చింది. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందినవి 76 కేంద్రాలు మాత్రమే ఉండగా, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం 883 ఉన్నాయని నివేదికలు సమర్పించాయని తెలిపింది. ఈ లెక్కల్లోని తేడాలపై, నిధుల వినియోగంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. గుర్తింపు కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని జంతు సంక్షేమ బోర్డును ఆదేశించింది. ఈ సుమోటో విచారణలో భాగంగా కుక్కల ప్రేమికులు, కుక్కకాటు బాధితులు, జంతు హక్కుల కార్యకర్తల వాదనలను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. యానిమల్ బర్త్ కంట్రోల్ నిబంధనల అమలు, ప్రజల భద్రత, కుక్కల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించడం వంటి అంశాలపై ఈ కేసు దృష్టి సారించింది. గతంలో, 2025 ఆగస్టులో జస్టిస్ జె.బి. పార్దివాలా నేతృత్వంలోని మరో ధర్మాసనం ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో వీధి కుక్కలన్నింటినీ వెంటనే పట్టుకుని షెల్టర్లకు తరలించాలని కఠిన ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఆ తీర్పుపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రస్తుత త్రిసభ్య ధర్మాసనం ఆ ఉత్తర్వులను సవరించింది. కుక్కలను తరలించే బదులు, ాదీజ నిబంధనల ప్రకారం వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసి తిరిగి అవే ప్రాంతాల్లో వదిలిపెట్టాలని స్పష్టం చేసింది. తాజాగా వాదనలు ముగియడంతో తుది తీర్పుపై ఉత్కంఠ నెలకొంది.

# హైదరాబాద్‌లో హైడ్రా కొరడా: జూబ్లీహిల్స్ 'నీరూస్'కు తాళాలు

**అగ్నిమాపక నిబంధనలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా**

**జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ నీరూస్ షోరూంను సీజ్ చేసిన అధికారులు**



హైదరాబాద్ నగరంలో అగ్నిమాపక భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఉక్కుపాదం మోపింది. ఇటీవల నాంపల్లిలో జరిగిన ఘోర అగ్నిప్రమాదం నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేసిన అధికారులు.. గురువారం జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ వస్త్ర దుకాణం 'నీరూస్' తో పాటు నాంపల్లిలోని మరో ఫర్నిచర్ షోరూంను సీజ్ చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులు సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లోని నీరూస్ షోరూంలో తనిఖీ చేయగా తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడ్డాయి. మూడు సెల్లార్లు, నాలుగు అంతస్తులతో పాటు, అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన రూఫ్ షెడ్‌లో కూడా భారీగా వస్త్రాలను నిల్వ ఉంచడాన్ని అధికారులు గుర్తించారు. ఫైర్ సేఫ్టీ ఎన్వోసీ లేకపోవడం, మంటలను ఆర్పే పరికరాలు సరిగా లేకపోవడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనం పై అంతస్తులను గోదాముగా, వస్త్రాల తయారీ కేంద్రంగా మార్చడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. వెంటనే షోరూంను సీజ్ చేయాలని ఆదేశించారు. అనంతరం అధికారులు నాంపల్లి స్టేషన్ రోడ్డులోని రహీమ్, మన్నన్ ఎస్టేట్స్ స్టాండర్డ్ ఫర్నిచర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఇటీవల ఐదుగురి మృతికి కారణమైన ప్రమాదం జరిగిన రోడ్డులోనే ఉన్నప్పటికీ ఈ షోరూంలో ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకపోవడాన్ని కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. ఆరు అంతస్తుల భవనంలో మెట్ల మార్గాన్ని కూడా మూసివేసి ఫర్నిచర్ నిల్వ ఉంచడం, కనీసం ఫైర్ ఎక్స్టింగ్విషర్లు కూడా లేకపోవడంతో ఈ షోరూంను కూడా సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ రెండు షోరూంల వద్ద 'ఫైర్ అన్ సేఫ్' బోర్డులను ఏర్పాటు చేసి, హైడ్రా ఫెన్సింగ్ వేశారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. నగరంలో ఎక్కడైనా ఫైర్ సేఫ్టీ నిబంధనలను ఉల్లంఘిస్తే, తమ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రజలను కోరారు. హైడ్రా కంట్రోల్ రూమ్ నంబర్ 9000113667 లేదా తన వాట్సాప్ నంబర్ 7207923085కు ఫొటోలు, వీడియోలతో సహా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

# వరాల తల్లి ఆగమనం

సమయంలో అత్యంత ఉద్వేగభరిత ఘట్టం ఆవిష్కృతమైంది. స్వాగత సూచకంగా ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఏకే47తో గాలిలోకి కాల్పులు జరిపారు. చిలకలగుట్ట గేటు వద్ద మరోసారి కాల్పులతో గౌరవ వందనం చేశారు. ఈ దృశ్యాలు భక్తుల్లో అపూర్వమైన ఉత్సాహాన్ని నింపాయి. జాతర నేపథ్యంలో జంపన్న వాగు వద్ద లక్షల సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మేడారం చుట్టుపక్కల ప్రాంతాలన్నీ గుడారాలతో నిండిపోయాయి. భారీ రద్దీ దృష్ట్యా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో 25 మంది ఐపీఎస్ అధికారులు పర్యవేక్షణ చేపట్టారు. తల్లుల దర్శనానికి క్యూలైన్లలో భక్తులు రెండు గంటలకు పైగా వేచి ఉండాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా శుక్రవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మేడారానికి రానున్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు అమ్మవారిని దర్శించుకొని ఎత్తుబంగారం సమర్పించారు. దీంతో మేడారం పరిసరాలు ప్రముఖుల రాకతో మరింత కోలాహలంగా మారాయి.

# కేసీఆర్‌కు సిట్ నోటీసు

వాంగ్మూలాలు, ఆధారాలను కేసీఆర్ ముందు ఉంచి వివరణ కోరే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ నెల 20న హరీశ్‌రావు, 23న కేటీఆర్, 27న సంతోష్‌రావులను సిట్ విచారించి వాంగ్మూలాలు నమోదు చేసింది. ఇప్పుడు నేరుగా కేసీఆర్‌ను పిలవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది. తాజా నోటీసుపై స్పందించిన కేసీఆర్ మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు శుక్రవారంతో ముగియనున్నాయని, అందువల్ల మరో తేదీ ఇవ్వాలని కోరారు. అలాగే సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని తన నివాసంలోనే విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. 160 సీఆర్పీసీ నిబంధనలను ప్రస్తావిస్తూ 65 ఏళ్లు దాటిన వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు రప్పించకూడదని, అవసరమైతే నివాసంలోనే విచారణ చేయాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ఇకపై పంపే నోటీసులన్నీ ఎర్రవల్లి చిరునామాకే పంపాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రధాన ప్రతిపక్ష నేతగా, దేశ పౌరుడిగా దర్యాప్తుకు పూర్తి స్థాయిలో సహకరిస్తానని కేసీఆర్ స్పష్టం చేశారు.

## ఇది విచారణ కాదు... ప్రతీకారం

### ::: కేసీఆర్‌కు సిట్ నోటీసులపై కేటీఆర్ ఫైర్

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది విచారణ కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేస్తున్న రాజకీయ ప్రతీకార చర్య అని ఆయన అభివర్ణించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్, పాలనా లోపాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ఇది కేవలం న్యాయాన్ని అపహాస్యం చేయడమేనని, రాజకీయ దురుద్దేశంతోనే ఈ నోటీసులు ఇచ్చారని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ.. “చావు నోట్లో తలపెట్టి, సచ్చుడో, తెలంగాణ వచ్చుడో అనే మొక్కవోని దీక్షతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన మహానాయకుడు కేసీఆర్. తన పదేళ్ల పాలనలో మిషన్ భగీరథ, రైతుబంధు, దళితబంధు వంటి పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపారు. సబ్బండ వర్గాలను కడుపులో పెట్టుకుని చూసుకున్నారు. అలాంటి నాయకుడిపై అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు విచారణల పేరుతో వేధించడం దుర్మార్గం“ అని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నందుకే బీఆర్ఎస్ అధినేతపై కాంగ్రెస్ కక్ష కట్టిందని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడని, కేవలం నోటీసులు ఇచ్చి, బెదిరింపులకు పాల్పడి తెలంగాణ ఉద్యమ చరిత్రను, ఆయన కీర్తిని చెరిపేయలేరని హెచ్చరించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే సహించేది లేదని, ప్రజలే సరైన సమయంలో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఈ కక్ష సాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తోందని, ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ అన్యాయ పాలనపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కేటీఆర్ ఉద్ఘాటించారు. చరిత్రను విచారణలతో కాదని, ప్రజల తీర్పుతోనే రాస్తారని ఆయన వ్యాఖ్యానించారు.

## కేసీఆర్ కు సిట్ నోటీసులు.. కేసు విచారణ సీరియస్ గా జరగడం లేదన్న కవిత

**రేపు కేసీఆర్ ను విచారించనున్న సిట్ అధికారులు**

**ఎన్నికలు ఉన్నందునే కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారన్న కవిత**

**కేసును త్వరగా ముగించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య**

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడం ఇరు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. రేపు మధ్యాహ్నం 3 గంటలకు విచారణ ఉంటుందని నోటీసుల్లో సిట్ అధికారులు పేర్కొన్నారు. రేపు కేసీఆర్ విచారణ నేపథ్యంలో తెలంగాణలో రాజకీయం వేడెక్కింది. సిట్ నోటీసుల నేపథ్యంలో కేసీఆర్ కూతురు, జాగృతి అధ్యక్షురాలు కవిత స్పందిస్తూ... కీలక వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికలు ఉన్నందునే కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. సిట్ విచారణ నాన్–సీరియస్ గా జరుగుతోందని, ఎన్నికల నేపథ్యంలోనే కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారని అన్నారు. కేసును సీరియస్ గా తీసుకుని త్వరగా ముగించాల్సిన అవసరం ఉందని... అయితే, కేసును ముగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా? లేదా? అనేది ఎవరికీ అర్థం కాని పరిస్థితి ఉందని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ జరగడం నిజంగానే చాలా బాధాకరమని... కానీ, దానికి తగినటువంటి పర్యవసానాలను నేరస్తులు ఎదుర్కొంటారా? లేదా? అనేది వేచిచూడాలని అన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు: కేటీఆర్ వాహనాన్ని తనిఖీ చేసిన అధికారులు

**మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అమల్లో ఉన్న ఎలెక్షన్ కోడ్**

**సిరిసిల్ల పర్యటనలో కేటీఆర్ వాహనం తనిఖీ**

**ఎన్నికల నిబంధనలకు కట్టుబడి ఉంటామన్న కేటీఆర్**



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో మరోసారి రాజకీయాలు వేడెక్కాయి. అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో రాజకీయ పార్టీలు బిజీగా ఉన్నాయి. మరోవైపు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వాహనాన్ని ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. సిరిసిల్ల పర్యటన సందర్భంగా పట్టణంలోని మానేరు వంతెన చెక్ పోస్టు వద్ద వాహనంలో సోదా చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... ఎన్నికల నిబంధనలకు పూర్తిగా కట్టుబడి ఉంటామని తెలిపారు. ఎన్నికల అధికారులకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ఇప్పటికే 18 మంది అభ్యర్థులను బీఆర్ఎస్ సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ తుల ఉమా ప్రకటించారు. మిగిలిన 21 వార్డుల అభ్యర్థులను కేటీఆర్ ప్రకటించనున్నట్లు సమాచారం.

# పారిశ్రామిక రంగంలో యువత రాణించాలి

## ఫిబ్రవరి 1న అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తల ఫోరం రజతోత్సవ వేడుకలు

## ప్రారంభించనున్న రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎపి మంత్రి టి.జి.భరత్,




హైదరాబాద్,జనవరి 29 (వాయిస్ టుడే): దేశ ఆర్థికాభివృద్ధికి రెండు దశాబ్దాలకు పైగా అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తల ఫోరం (ఎ.ఐ.ఎ.వి.ఐ.ఎఫ్) ఎంతో కృషి చేస్తున్నదని, ప్రభుత్వ సహాకారంతో రానున్న రోజుల్లో యువతకు పారిశ్రామిక రంగంలో మెళకువలు నేర్పించడంతో పాటు ఎంఎస్ఎంఈ లకు ప్రోత్సాహం అందిస్తామని ఎ.ఐ.ఎ.వి.ఐ.ఎఫ్ అధ్యక్షులు రాంబాబు పబ్బిశెట్టి తెలిపారు. ఎ.ఐ.ఎ.వి.ఐ.ఎఫ్ రజతోత్సవాలను 2026 ఫిబ్రవరి 1న హైదరాబాద్ నానక్ రామ్ గూడా, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ 'ప్రధాన్ కన్వెన్షన్'లో ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ బషీర్ బాగ్ లోని దేశోద్ధారక భవన్ గురువారం జరిగిన ఎఐఎవిఐఎఫ్ ప్రి లాంచ్ మీడియా సమావేశంలో అధ్యక్షులు రాంబాబు పబ్బిశెట్టి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బత్తుల, సంయుక్త కార్యదర్శి కాశి విశ్వనాథం చింత, ట్రెజరర్ విజయ ప్రసాద్ గుంపల్లి, కన్వీనర్ మంచి రాజశేఖర్, మీడియా చైర్మన్ ఎర్రం బాలక్రిష్ణ తదితరులు కలిసి ఫోరం రజతోత్సవాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తల ఫోరం 25 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్నదని తెలిపారు. ఈ 25 ఏళ్లుగా యువ పారిశ్రామికవేత్తలకు పోత్సాహాన్ని అందిస్తున్నామని, వ్యాపార, వాణిజ్య రంగాలలో పారిశ్రామికవేత్తలకు అవసరమైన సూచనలు, సలహాలను అందిస్తూ వారి అభ్యున్నతికి తోడ్పడుతున్నామన్నారు. అలాగే రజతోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్, గౌరవ అతిథులుగా నిజామాబాద్ ఎంఎల్ఏ ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎం.ఎల్.సి బొగ్గారపు దయానంద్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు ఎంఎల్ఎ లు, ఎంపిలు, ఐఎఎస్ లు, ఐపిఎస్ లు, ఆర్యవైశ్య ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొంటారని నిర్వాహకులు వివరించారు. ఈ వేడుకల్లో పారిశ్రామిక రంగం పట్ల యువతలో ఆసక్తిని పెంపొందించేందుకు 50 సంబంధిత స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.




## జింఖానా గ్రౌండ్లో తార్నాక థండర్స్ ఘన విజయం

**కెప్టెన్ రాజ్ (రాజ్ న్యూస్) అద్భుతంగా 81 పరుగులు చేసి జట్టు విజయానికి బలమైన పునాది..**

హైద్రాబాద్ (వాయిస్ టుడే):ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంసాద్ ఖేల్ మహోత్సవం 2025-26 లో భాగంగా దేశవ్యాప్తంగా క్రీడా సంస్కృతిని, ఫిట్ నెస్ ప్రాముఖ్యతను పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న పీఎం సంసద్ ఖేల్ మహోత్సవ్ 2026 ఉత్సాహంగా పాల్గొన్న తార్నాక థండర్స్ జట్టు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏబీవీ ఫౌండేషన్ పి ఎం సంసద్ ఖేల్ మహోత్సవ్ 2026 ను విజయవంతంగా నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా జింఖానా గ్రౌండ్ వేదికగా మీడియా క్రికెట్ లీగ్ లో తార్నాక థండర్స్... వర్సెస్ సెంట్రల్ జోన్ వారియర్స్ మధ్య క్రికెట్ మ్యాచ్ లో తార్నాక థండర్స్ 128 స్కోర్ ను ఛేదించి ఘన విజయం సాధించింది కెప్టెన్ రాజు (రాజ్ న్యూస్) అద్భుతం గా 81 పరుగులు చేసి జట్టు విజయానికి బలమైన పునాది వేశారు. కీలక సమయా ల్లో అన్ని విభాగాల్లో సమన్వయంతో ఆడి న తార్నాక థండర్స్ ఆటగాళ్లు అభిమాను ల ప్రశంసలు అందుకున్నారు. టీం లో కెప్టెన్ రాజు(రాజ్ న్యూస్),నరసింహ రాజు (సాక్షి టీవి),శివ (జై భీం), తిరుమల్ రెడ్డి(ఎన్ టీవీ), గణేష్ (ఈటీవీ),(ఎన్ టీవీ), వెంకట్ (99టీవీ), ఫణి (ఏబీఎన్), కిరణ్ (టీవీ9), హరీష్(హెచ్ఎం టీవీ), జాఫర్(1 టీవీ), జీవన్ రెడ్డి(మెట్రో టీవి), విశ్వం గౌడ్(క్యూ న్యూస్), విజయ్ (మహా న్యూస్), దినేష్ (బిగ్ టీవీ), రవి (జై భీం) కు నిర్వాహకులు అభినందనలు తెలిపారు.



## న్యాయవాదులు సరైన ప్రతినిధిని ఎన్నుకోవాలి

**వన్ మ్యాన్ ఆర్మీ బి. శంకర్‌ను గెలిపించండి**

**సీనియర్ అడ్వకేట్ కాసుల వినోద్**

హైదరాబాద్, జనవరి 29: వాయిస్ టుడే: హైకోర్టు బార్ కౌన్సిల్ ఎన్నికల్లో న్యాయవాదులు సరైన ప్రతినిధిని ఎన్నుకోవడంలో విఫలమైతే న్యాయం తిరస్కరించబడుతూనే ఉంటుందని, అందువల్ల సరైన ప్రతినిధిని ఎన్నుకోవాలని సీనియర్ అడ్వొకేట్ కాసుల వినోద్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బార్ కౌన్సిల్ సభ్యునిగా పోటీ చేస్తున్న బి.శంకర్ కు మద్దతుగా న్యాయవాదులతో కలిసి గురువారం ఆయన ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు నేడు న్యాయం కోసం నిలబడకపోతే, మనకు ఇంకెప్పుడూ అవకాశం రాకపోవచ్చునని అన్నారు. తన ధైర్యం సమగ్రతను ఇప్పటికే నిరూపించుకున్న నాయకుడు శంకర్ కు మీ విలువైన ఓటును వేయాలని ఆయన న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు.




**వన్ మ్యాన్ ఆర్మీ - బి. శంకర్**

ఇతరులు మౌనం వహించాలని నిర్ణయించినప్పుడు బి. శంకర్ లేచి నిలబడి న్యాయం కోసం తన గొంతును పెంచాడు. న్యాయవాదులు కష్టపడి సంపాదించిన సంక్షేమ నిధులు దుర్వినియోగం మరియు మోసం జరిగినప్పుడు ఆయన బార్ కౌన్సిల్‌కు వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడారు. ఈ నిధులు మన భద్రత కోసం ఉద్దేశించబడ్డాయి. ప్రైవేట్ జేబులు నింపడానికి కాదు. న్యాయవాదులు సరైన ప్రతినిధిని ఎన్నుకోవడంలో విఫలమైతే, న్యాయం తిరస్కరించబడుతూనే ఉంటుంది. ఇది తెలివిగా ఎంచుకోవలసిన సమయం---గుడ్డిగా కాదు, ఎవరైనా తెలిసినవారు లేదా సుపరిచితులు కాబట్టి. "అభి నహి, తో కభి నహి."

**ఇప్పుడు కాకపోతే, ఎప్పుడు?**

మనం నేడు న్యాయం కోసం నిలబడకపోతే, మనకు ఇంకెప్పుడూ అవకాశం రాకపోవచ్చు. తన ధైర్యం మరియు సమగ్రతను ఇప్పటికే నిరూపించుకున్న నాయకుడికి మీ విలువైన ఓటును ఇవ్వండి. బి. శంకర్‌కు ఓటు వేయండి --- వన్ మ్యాన్, వన్ మిషన్, వన్ ఓటు వేయాలని కాసుల వినోద్ కోరారు.

## జర్నలిస్టు కుటుంబానికి టీడబ్ల్యూజేఎఫ్ మద్దతు

**- రోడ్డు ప్రమాదంలో గాయపడిన టిబిజేఏ అధ్యక్షుడు సామ్రాట్ గుప్తా కుమారుడు**

**- పరామర్శించిన రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య**



హైదరాబాద్, జనవరి 29 (వాయిస్ టుడే): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ నాగోల్ రాక్‌టౌన్ కాలనీలోని పవన్ సాయి ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, టీబీజేఏ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సామ్రాట్ గుప్తా కుమారుడు హర్షిత్ తేజను ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య గురువారం పరామర్శించారు. సిద్ధిపేట జిల్లాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న హర్షిత్ తేజ తన మామయ్యతో కలిసి కారులో ప్రయాణిస్తుండగా లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ తీవ్ర ప్రమాదంలో అతనికి కుడికాలు, కుడిచేయి విరిగాయి. ప్రస్తుతం పవన్ సాయి ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, నేడు శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య హర్షిత్ తేజ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, సామ్రాట్ గుప్తా కుటుంబానికి ధైర్యం చెప్పారు. అలాగే వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయం అందజేసి, టీడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్టు కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



## అమృతాలయ ఏకాదశి వార్షిక బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ జనవరి 29(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని గణేష్ నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న ఏకాదశి వార్షిక బ్రహ్మోత్సవల సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన వెంకటేశ్వర స్వామి పూజా కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, స్వామివారి కృప కటాక్షాలు, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో అందరూ సంతోషంగా ఉండాలని భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఆలయ కమిటీ వారు శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, దుర్గారావు, వెంకటేష్ యాదవ్, నరసింహారెడ్డి,లింగం యాదవ్ మరియుఆలయ కమిటీ సభ్యులు, డివిజన్ నాయకులు, మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీ గాలి పోచమ్మ ఆలయాన్ని దర్శించుకున్న కంటెస్టెడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్

కుత్బుల్లాపూర్ జనవరి 29(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని దేవేందర్ నగర్ లో గల ( గాలి పోచమ్మ బస్తి )గల గాలి పోచమ్మ ఆలయ జాతర సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్న కంటెస్టెడ్ కార్పోరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ గాలి పోచమ్మ తల్లి ఆశీస్సులు దీవెనలు, కృపా కటాక్షాలు, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని ఆకాంక్షించారు, అనంతరం ఆలయ కమిటీ వారు శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బుచ్చిరెడ్డి మరియు ఆలయ కమిటీ సభ్యులు డాన్ శీను, నరసింహ, కాంగ్రెస్ నాయకులు మోతే శ్రీను, ప్రసాద్, జహంగీర్, తోసిపు, రజాక్ ఇతర డివిజన్ నాయకులు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పలు డివిజన్ తాగునీటి సమస్యపై హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి ఎండీని కలిసిన కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ జనవరి 29(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు డివిజన్‌లో నెలకొన్న తాగునీటి సమస్యపై హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి ఎండీ అశోక్ రెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా వాటర్ లైన్ పనులు మరియు ఔట్లెట్‌లకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. దీనిపై ఎండీ సానుకూలంగా స్పందిస్తూ, రానున్న రోజుల్లో సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్, సిద్దనోల సంజీవరెడ్డి, మైసిగారి శ్రీనివాస్, పద్మారావు, మనోజ్ రెడ్డి, శరత్ చెంద్ర,దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ సరికాదు

**సికింద్రాబాద్ శాసనసభ్యులు పద్మారావు గౌడ్**



సికింద్రాబాద్, జనవరి 29 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసులు జారీ చేయడం సరికాదని కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం శోచనీయమని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం సీతాఫలమండీ లో మీడియా తో మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పాలనను సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకు నోటీసులు జారీ చేస్తోందని విమర్శించారు. ప్రజలకు అందించిన హామీలను పాలకులు విస్మరించారని, ప్రజాగ్రహం నుంచి దృష్టిని మళ్లించేందుకు కొత్త వ్యూహాలు వెతుకుతున్నారని ఆరోపించారు. గతంలో తాము పాలనలో ఉన్నామని, కుట్ర పూరితంగా, కక్షలు సాదించేలా రాజకీయాలు చేయలేదని స్పష్టం చేశారు. మళ్ళీ తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పద్మారావు గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు కుతంత్రలు చేసినా, కక్ష పూరితంగా వ్యవహరించినా ధైర్యంగా ఎదుర్కొంటామని పేర్కొన్నారు.





# ప్రజల ఆదరణతో ఘనంగా దేగల సతీష్ బాబు పుట్టినరోజు వేడుకలు

కుత్బుల్లాపూర్ : జనవరి 29(వాయిస్ టుడే): సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఉషోదయ కాలనీ ప్రెసిడెంట్, ఐఎన్టీయూసీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తెలంగాణ కేబుల్ ఓ ఇంటర్నెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దేగల సతీష్ బాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ వేడుకలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి హాజరై సతీష్ బాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కాలనీ వాసులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా దేగల సతీష్ బాబు మాట్లాడుతూ తన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రుద్ర సంతోష్ కుమార్,వాయిస్ టుడే ఎండి కొత్త లక్ష్మణ్ పటేల్, బీజేపీ కార్పొరేటర్ శేషగిరిరావు, భరత్ సింహారెడ్డి,సీనియర్ జర్నలిస్ట్ వాసాల బాలరాజు ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు మరియు బంధుమిత్రులు పాల్గొన్నారు.





# రాజీనామా చేసి గెలువ్... రాజకీయ సన్యాసం తీసుకుంటా

**ఎమ్మెల్యేకు దాస్యం బహిరంగ సవాల్**

**అభివృద్ధి నిరంతర ప్రక్రియ..**
**నీతో మొదలు కాలేదు, నీతో ఆగిపోదు**

**నీ కొడుక్కి చిల్లర మాటలు మానేయమని చెప్పు..**

**పోస్టింగ్ ఆశ చూపి బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులతో అక్రమ కేసులు..**

హనుమకొండ (వాయిస్ టుడే): "అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ.. అది నీతో మొదలు కాలేదు, నీతో ఆగిపోదు. అధికార బలుపుతో పేదల గుడిసెలు కూల్చడం, పోలీసులతో అక్రమ కేసులు పెట్టించడం నీచ సంస్కృతి" అని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఎమ్మెల్యేపై నాయిని రాజేందర్ రెడ్డి పై మండిపడ్డారు. గురువారం హనుమకొండ లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని పై వినయ్ భాస్కర్ సవాల్ విసిరారు. నీకు నీ అభివృద్ధిపై నమ్మకం ఉంటే మేడారం జాతర ముగిశాక ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్ళీ గెలిచి చూపించు. ఒకవేళ నువ్వు గెలిస్తే నేను శాశ్వతంగా రాజకీయాల నుండి తప్పుకుంటా.. ఇది నా ఓపెన్ ఛాలెంజ్" అని వినయ్ భాస్కర్ ప్రకటించారు. ఉప ఎన్నికల్లో గెలిచే సత్తా లేని వ్యక్తి కార్పొరేషన్ లో 26 స్థానాలకు 26 స్థానాలు గెలుస్తానని ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. భద్రకాళి చెరువు మట్టి అమ్మకంపై,కాంట్రాక్టర్ల దగ్గర తీసుకున్న కమీషన్లపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. కేవలం కాళోజీ కళాక్షేత్రానికి రంగులు వేసి తానే కట్టినానని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. భద్రకాళి మాడవీధుల వద్ద పేదలు వేసుకున్న గుడిసెలను,దళితుల షాపులను కూల్చివేస్తున్నారని మండిపడ్డారు. పేదలకు పట్టాలు ఇచ్చే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. భద్రకాళి చెరువు పనులను సకాలంలో పూర్తి చేయకపోవడం వల్లే హన్మకొండ, వరంగల్ నగరం మునిగిపోయిందని.. లక్షలాది రూపాయల ఆస్తి నష్టం జరిగిందని ధ్వజమెత్తారు.

**సంస్కారం లేని మాటలు..**

"నేను నాలుగు సార్లు గెలిచినా ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టలేదు. నేను చదువుకున్న వాడిని,సంస్కారం ఉన్నవాడిని.. నీలాగా విదేశాల్లో తిరగడం,క్లబ్బు లకు వెళ్లడం,కోళ్ల పందాలు ఆడటం నాకు తెలియదు" అని వ్యక్తిగత విమర్శలు చేశారు. నాయిని నరేందర్ కుమారుడైన ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డిని ఉద్దేశించి.. "నాయిని బాపు గారికి చేతులు జోడించి చెబుతున్నా.. నీ కొడుక్కి చిల్లర మాటలు మానేయమని చెప్పు" అని పేర్కొన్నారు.

**పోలీసులకు హెచ్చరిక..**

పోస్టింగ్ ఆశ చూపి పోలీసులతో బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారని,ఇది సరికాదని..చట్ట వ్యతిరేకంగా వ్యవహరించే పోలీసులను తాము వదిలిపెట్టబోమని దాస్యం వినయ్ భాస్కర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ సోదా కిరణ్,మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్,మేకల బాబు రావు,పశ్చిమ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పులి రజనీకాంత్,నాయకులు సల్వాజి రవీందర్ రావు,ఇమ్మడి రాజు, సదాంత్, చందర్, శ్రీధర్, డా.మనోజ్,దువ్వ కనకరాజు,కుమ్మరి కోటిలింగం, విక్రమ్,మహమూద్,శ్రీనివాస్,ఖలీల్,మహేందర్,శ్రీకాంత్, వీరస్వామి,రాకేష్ యాదవ్, రాజ్‌కుమార్, రాజు, సారిక, ప్రదీప్, వినయ్,ప్రకాష్,శరత్ చంద్ర, రంజిత్, గోపాల్, శ్రీనాథ్, ఫాజిల్,రాంచందర్,స్నేహిత్,సృజన్ కుమార్, రఘు, అనిల్, హబీబ్,వినీల్ రావు,జేకే పాల్గొన్నారు.

**కాంగ్రెస్ కక్షపూరిత దోరణికి నిదర్శనం సిట్ నోటీసులు..**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసుల నేపథ్యంలో దాస్యం వినయ్ భాస్కర్ హనుమకొండలోని రహదారిపై కాంగ్రెస్ ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రతిష్టను దిగజార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. తెలంగాణను కొట్లాడి సాధించిన నేతపై కుట్రపూరితంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని ఆగ్రహించారు. 14 ఏండ్ల సుదీర్ఘ పోరాటం,10 ఏండ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణను దేశంలోనే అగ్రభాగన నిలిపిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. ప్రజల్లో కేసీఆర్ ని పలచన చేసేందుకే కుంచిత మనసుతో ఈ ప్రభుత్వం నోటీసులు,కమిషన్లు,సిట్‌ల పేరిట వేధింపులకు గురి చేస్తోందని మండిపడ్డారు. ఎన్ని కేసులు,నోటీసులు,సిట్‌లు ఎన్ని వేసినా ప్రజల తరపున కేసీఆర్ సైన్యంమైన మేము పోరాడుతామని వినయ్ భాస్కర్ తెలియజేశారు.

## మునిసిపల్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా ఇనగాల



హనుమకొండ, వాయిస్ టుడే: రానున్న మునిసిపల్ ఎన్నికలను అత్యంత ప్రాధాన్యతతో తీసుకున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్రవ్యాప్తంగా పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా కన్వీనర్లను నియమించింది. ఈ క్రమంలో వరంగల్,మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో జరిగే మునిసిపల్ ఎన్నికల నిర్వహణ బాధ్యతలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,పొన్నం ప్రభాకర్ లతో పాటుగా కుడా చైర్మన్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామిరెడ్డి కి అప్పగిస్తూ కన్వీనర్‌గా నియమించింది. ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న మునిసిపాలిటీలలో పార్టీని బలోపేతం చేయడం, ఎన్నికల వ్యూహరచన, సమన్వయం, ప్రచార కార్యక్రమాల పర్యవేక్షణ వంటి కీలక బాధ్యతలను ఇనగాల వెంకట్రామిరెడ్డి నిర్వర్తించనున్నారు. పార్టీ క్యాడర్‌తో పాటు స్థానిక నాయకత్వాన్ని సమన్వయం చేస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా ఈ నియామకం జరిగిందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.



## కేసీఆర్‌కు సిట్ నోటీసులు రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గ చర్యలకు పరాకాష్ట

ఆసిఫ్ నగర్, జనవరి 29(వాయిస్ టుడే):తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తపల్లి మండల కేంద్రలోని బావుపేట గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా రాస్తారోకో కార్యక్రమానికి మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరై నిరసనలో పాల్గొని ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలే పణంగా పెట్టిన కేసీఆర్ కు కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ నోటీసులు ఇచ్చి అవమాన పరచడం సిగ్గుచేటని,తెలంగాణ నవ నిర్మాణంలో ముందు చూపుతో అనేక ప్రాజెక్టులు నిర్మించి రాష్ట్రాన్ని దేశంలో ఉన్నత స్థానంలో నిలిపిన రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిని సిట్ కమిటీ ముందు హాజరు కావాలని నోటీసులు ఇచ్చి అవమాన పరచడం తెలంగాణ ప్రజలను అవమాన పరిచినట్లే అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి,మాజీ జెడ్పీటీసీ పిట్టల రవీందర్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ రెడ్డవేణి మధు, వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, మీరుదొడ్డి నవీన్,గ్రామ శాఖ నాయకులు పాల్గొన్నారు.





## వనదేవతలను దర్శించుకున్న కేంద్ర మంత్రులు

**మొక్కులు సమర్పించిన మంత్రులు భట్టి,పొంగులేటి,టీపీసిసి ఛీఫ్**

**ఘన స్వాగతం పలికిన అధికారులు**

హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర సందర్భంగా అమ్మవార్లను కేంద్ర గిరిజన సంక్షేమ శాఖమంత్రి మరియు కేంద్ర బొగ్గగనుల శాఖామంత్రి కిషన్ రెడ్డి లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,అడ్లూరి లక్ష్మణ్ కుమార్,సీతక్క లు ఆదివాసీ సంప్రదాయ కళాకారుల నృత్య ప్రదర్శనలతో ఘనంగా స్వాగతం పలికారు. వీరితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దంపతులు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దంపతులు,టిపీసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దంపతులు వనదేవతలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సమ్మక్క సారలమ్మ తల్లులకు నిలువెత్తు బంగారంతో మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లను దర్శించుకుని రాష్ట్ర ప్రజల సంక్షేమం,రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధి కోసం ప్రార్థించినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వనదేవతలు తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాల సుఖ సంతోషాలతో ఉంచాలని వేడుకున్నామని తెలిపారు. మేడారం జాతర సందర్భంగా చారిత్రాత్మక కట్టదాలు దేశ ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయని..గతంతో పోలిస్తే ఈసారి జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తు న్నారని పేర్కొన్నారు.

## పేదలకు అన్యాయం చేయాలనే ఉద్దేశం తనకు లేదు..

**ప్రతిపక్ష ఆరోపణలకు ఆధారాలతో సమాధానం..**

**మాడవీధుల వల్ల నష్టపోతున్న ప్రతీ కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు,ఉద్యోగం:ఎమ్మెల్యే నాయిని**



హనుమకొండ, వాయిస్ టుడే: పేదలకు అన్యాయం చేయాలనే ఉద్దేశం తనకు లేదని..నేడు ప్రతిపక్షంలో ఉన్నవారే గతంలో అధికారంలో ఉన్న సమయంలో గుడిసె వాసులను తొలగించాలంటూ సమావేశాలు నిర్వహించి నిర్ణయాలు తీసుకున్న విషయాలను,వాస్తవాలను వరంగల్ పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గుర్తు చేశారు. భద్రకాళి మాడ వీధుల అభివృద్ధిపై ప్రతిపక్ష నాయకుల ఆరోపణలకు గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నాయిని ఆధారాలతో సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రకాళి మాడ వీధుల అభివృద్ధిలో భాగంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న గుడిసెలను తొలగించి అక్కడ నివసిస్తున్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో ప్రతిపక్ష నాయకులు చేస్తున్న ఆరోపణలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. అప్పుడు గుడిసెలు తొలగించాలన్నవారే ఇప్పుడు అభివృద్ధి పేరుతో అన్యాయం జరుగుతుందని ఆరోపించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. భద్రకాళి మాడ వీధుల అభివృద్ధి వల్ల నష్టం కలిగే ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేయిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఎవరికీ అన్యాయం జరగకుండా ఇంటికో ఉద్యోగం వచ్చేలా జిల్లా కలెక్టర్‌తో చర్చించామని చెప్పారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడమే ప్రతిపక్ష లక్ష్యమని,ప్రజల మేలు కోసం చేపడుతున్న కార్యక్రమాలను వక్రీకరించడం అభివృద్ధి నిరోధక ధోరణికి నిదర్శనమని నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. పేదల పక్షాన నిలబడుతూ అభివృద్ధిని కొనసాగిస్తామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.



## ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పాటించాలి

**హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్నేహ శబరీష్**

**పరకాల మున్సిపాలిటీలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్**

హనుమకొండ: నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఎన్నికల సంఘం నియమ నిబంధనలను పాటించాలని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా పరకాల పురపాలక సంస్థ (మున్సిపాలిటీ)లో 22 వార్డులకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పురపాలక సంస్థ కార్యాలయంలో కొనసాగుతుండగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ పరిశీలించారు. 11వార్డులకు ఒకటి చొప్పున మొత్తం 22వార్డులకు గాను నామినేషన్ల స్వీకరణకు రెండు కౌంటర్లను ఏర్పాటు చేసి అభ్యర్థుల నుండి నామినేషన్లను స్వీకరిస్తుండగా వాటి వివరాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పురపాలక కమిషనర్ అంజయ్య,ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్లు,ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సందేహాల నివృత్తి,సహాయం కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేసి రిటర్నింగ్,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ కు పురపాలక కమిషనర్ వివరించారు. రిటర్నింగ్,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు,పోలింగ్ మెటీరియల్,స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు,ఈ ప్రక్రియకు సంబంధించిన వివరాలను కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణకు ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నామినేషన్లు,ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సందేహాల నివృత్తికి హెల్ప్ డెస్క్ ల ద్వారా సహకారం అందించాలని అన్నారు. నామినేషన్ల అనంతరం అభ్యర్థులకు గుర్తులు కేటాయింపులో జాగ్రత్త వహించాలని సూచించారు. అధికారులు,రిటర్నింగ్,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ పలు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ,తహసీల్దార్ విజయలక్ష్మి,టిపిఎస్ ఖురేషి,టీపిఓ సందీప్ రెడ్డి,ఏఈ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిట్ నోటీసులు కేసీఆర్ ప్రతిష్టను దిగజార్చే కుట్ర

**మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్**

**వర్ధన్నపేటలో సీఎం,ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం..**

కాజీపేట, వాయిస్ టుడే: మాజీ ముఖ్యమంత్రి టిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ ప్రతిష్టతను ప్రజలలో ఆయనకున్న పలుకుబడిని దిగజార్చేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ రూపంలో ప్రయత్నం చేస్తున్నదని వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే 6 రమేష్ ఆరోపించారు మాజీ సీఎం కేసీఆర్ కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు నోటీసులు జారీ చేసిన తరుణంలో అందుకు నిరసనగా వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను ఆరూరి రమేష్ మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు తో కలిసి దగ్దం చేసి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆరూరి రమేష్ మాట్లాడుతూ ఇలాంటి సిట్ లు ఎన్ని వచ్చినా కెసిఆర్ ను ఏమి చేయలేవని..రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని,త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో దాదాపు అన్ని మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలియజేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఖమ్మం రహదారిపై ధర్నా నిర్వహించారు.



వాయిస్ టుడే
హైదరాబాద్
శుక్రవారం 30 జనవరి 2026



## సమ్మక్క సారలమ్మ జాతరలో వివేకానంద ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ సేవ

కరీంనగర్,జనవరి29(వాయిస్ టుడే): స్థానిక వివేకానంద డిగ్రీ మరియు పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ నగునూరులోని సమ్మక్క సారలమ్మ గద్దెల దగ్గర పోలీస్ వారికి సహాయంగా తమ సేవలను అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి హెచ్ శ్రీనివాస్ తెలిపారు.





## 25వ డివిజన్ బిజెపి తరపున నామినేషన్ దాఖలు చేసిన కటకం లోకేష్

కరీంనగర్,జనవరి29(వాయిస్ టుడే): నగరపాలక సంస్థ 25వ డివిజన్ (సుభాష్ నగర్) బిజెపి తరపున కటకం లోకేష్ నామినేషన్ దాఖలు చేశారు.కరీంనగర్ నగరపాలక సంస్థ 25 డివిజన్ ప్రజల ఆశీస్సులతో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి తరపున బరిలో నిలుస్తున్నట్లు కటకం లోకేష్ ఈ సందర్భంగా చెప్పారు.



## కరీంనగర్ 11వ డివిజన్‌లో పండుగ స్వప్న-నాగరాజు నామినేషన్ దాఖలు

కరీంనగర్,జనవరి29(వాయిస్ టుడే): నగరపాలక సంస్థ పరిధిలోని 11వ డివిజన్‌లో పండుగ స్వప్న--నాగరాజు నామినేషన్‌ను అధికారికంగా దాఖలు చేశారు.ఎన్నికల అధికారుల సమక్షంలో అవసరమైన పత్రాలతో నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై తమ మద్దతు ప్రకటించారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని, డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని పండుగ స్వప్న--నాగరాజు తెలిపారు. డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం,తాగునీరు, రోడ్ల నిర్మాణం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.



## రక్తసంబంధీకులనుండి పిల్లల దత్తత

### ఉత్తర్వులు అందజేసిన కలెక్టర్

కరీంనగర్,జనవరి 29(వాయిస్ టుడే): బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న ఏడు సంవత్సరాల బాలికను హైదరాబాద్ కు చెందిన పిల్లల్ని దంపతులు దత్తత తీసుకున్నారు.కరీంనగర్ అర్బన్ పరిధిలోని గోపాల్ పూర్ కు చెందిన పిల్లలు లేని దంపతులు వారి సమీప బంధువుల నుండి 13 సంవత్సరాల బాబును దత్తత తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతులమీదుగా ఈ దత్తత కార్యక్రమం కలెక్టరేట్లో జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని అన్నారు.రక్త సంబంధీకుల నుండి దత్తత తీసుకోవాలనుకునే వారు, బాల సదనాల నుండి దత్తత కోరుకునేవారు జిల్లా పరిషత్ లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి,జిల్లా బాలల పరిరక్షణ అధికారి దుర్గాన పర్వీన్,సిడబ్ల్యుసి మెంబర్లు కళింగ శేఖర్,విజయ్ కుమార్,ఎల్.పి.ఓ రాజు, మిషన్ వాత్సల్య సిబ్బంది తిరుపతి,సాధినేని రమేష్, కవిత,రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## 50వ డివిజన్ బిజెపి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన బోయినపల్లి ప్రవీణ్ రావు.



కరీంనగర్,జనవరి29(వాయిస్ టుడే): నగరపాలక సంస్థ 50 వ డివిజన్ (జ్యోతి నగర్, చైతన్యపురి) బిజెపి అభ్యర్థిగా బోయినపల్లి ప్రవీణ్ రావు నామినేషన్ దాఖలు చేశారు.కరీంనగర్ 50 డివిజన్ ప్రజల ఆశీస్సులతో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి తరపున బరిలో నిలుస్తున్నట్లు బోయిన్పల్లి ప్రవీణ్ రావు ఈ సందర్భంగా చెప్పారు.

# పని దినాలు పెంచినందుకు ఉపాధి హామీ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలా...?

**గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేయడం కోసమే వి బి జి రామ్ చట్టం.**

**కేవలం చట్టంలో రామ్' అనే పేరున్నందుకే 'వి.బి.జి. రామ్ జీ' ని వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్**

**వి బి జి రామ్ చట్టంపై తెలంగాణ కాంగ్రెస్ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం.**

**బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి**




మానకొండూర్,జనవరి29(వాయిస్ టుడే): ఉపాధి హామీ పథకంలో విప్లవాత్మక మార్పులు తెస్తూ,కూలీల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వికసిత భారత్ గ్యారెంటీ వి బి జి బిరామ్ జీ - 2025' చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించడం దారుణమని,పని దినాల పెంపే లక్ష్యంగా,గ్రామ స్వరాజ్యం బలోపేతమే లక్ష్యంగా తీసుకువచ్చిన వి బి జి రామ్ చట్టంపై కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం చేస్తుందని ,కేవలం వి బి జి రామ్ చట్టంలో 'రామ్' అనే పేరున్నందుకే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం ఆ పార్టీ దివాళాకోరుతనానికి నిదర్శనమని బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. మానకొండూరు మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడారు.వి బి జి రామ్ చట్టంపై మానకొండూరులో తెలంగాణ కాంగ్రెస్ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ చేసిన వ్యాఖ్యలను బిజెపి జిల్లా పక్షాన తీవ్రంగాఖండిస్తున్నామన్నారు. వి బి జి రామ్ చట్టంపై దుష్ప్రచారం చేయడం,ప్రజలను తప్పుదారి పట్టించడమే లక్ష్యంగా కాంగ్రెస్ నేడు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏ మంచి పని చేపట్టినా అడ్డుపడటమే కాంగ్రెస్ అలవాటుగా మార్చుకుందని ఆయన ఘాటుగా విమర్శించారు.11 ఏళ్లలో మోడీ ప్రభుత్వం తీసుకున్న అనేక చారిత్రాత్మక నిర్ణయాలను వ్యతిరేకించిన కాంగ్రెస్‌ను దేశ ప్రజలు ఇప్పటికే తిరస్కరించిన ఇంకా ఆ పార్టీకి బుద్ధి రావడం లేదన్నారు.దేశ ప్రజల కోసం,దేశహితం కోసం పనిచేస్తున్న భారతీయ జనతా పార్టీ ప్రజల మద్దతుతో మూడోసారి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. దశాబ్దాలు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ తీసుకున్న ప్రజా వ్యతిరేక విధానాలతో నేడు కేవలం మూడు రాష్ట్రాలకే పరిమితం చేసినా ఆ పార్టీ తీరు మారలేదని ఎద్దేవా చేశారు. ప్రధానంగా వి బి జి రామ్ చట్టంపై కూలీలకు ఏటా 125 రోజుల పని కల్పించే చట్టబద్ధమైన గ్యారెంటీ, పనిచేసిన 15 రోజుల్లోపే నేరుగా ఖాతాల్లోకి వేతనాల జమ, దేశవ్యాప్తంగా ఉపాధి హామీ బడ్జెట్‌ను రూ. 86 వేల కోట్ల నుంచి రూ. 1.50 లక్షల కోట్లకు పెంచడం జరిగిందని తెలిపారు.చట్టం వల్ల తెలంగాణకు అదనంగా రూ. 346 కోట్ల నిధులను కేటాయించి ఉపాధి కూలీలకు కేంద్రం అండగా నిలబడిందని ఆయన పేర్కొన్నారు.డిజిటల్ హాజరు ద్వారా అవినీతికి తావులేకుండా అర్హులైన కూలీలకు సరైన వేతనం అందుతుందనికాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2004 నుంచి 2014 వరకు కేవలం 1,89 వేల కోట్ల రూపాయలు ఉపాధి పనికి కేటాయిస్తే నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం 2014 నుంచి 2024 వరకు 8 లక్షల కోట్ల రూపాయలు కేటాయించిందనే విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఉపాధి హామీ చట్టంపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని బీజేపీ కార్యకర్తలు గ్రామగ్రామాన తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధికి,భూగర్భ జలాల పెంపునకు, మౌలిక వసతుల కల్పనకు ఈ చట్టం ఎంతో దోహదపడుతుందని వివరించారు. కూలీల కడుపు కొట్టేలా వ్యవహరిస్తున్న కాంగ్రెస్‌కు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కందిరాజి రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల,వెంకట్ రెడ్డి,రంగు భాస్కరాచారి,వి బి జి రామ్ జి జిల్లా కన్వీనర్ కరివేద మహిపాల్ రెడ్డీ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అప్పని తిరుపతి, మాజీ మండల అధ్యక్షులు రాపాక ప్రవీణ్,మియపురం లక్ష్మణచారి, సోన్నకుల శ్రీనివాస్,కత్తి ప్రభాకర్ గౌడ్, బొగ్గుల రమేష్,వార్డు సభ్యులు భాషబోయిన ప్రదీప్ యాదవ్, మార్కొండ రమేష్ పటేల్,పోచంపల్లి శ్రీనివాస్,మీసా రమణయ్య,కొండ్ర వరప్రసాద్,మాదాసు కుమార్,మీసా రాజేష్,రమేష్ పాల్గొన్నారు.



## మత్స్య గిరీంద్ర స్వామి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి, సత్తు మల్లేష్

మానకొండూర్,జనవరి29(వాయిస్ టుడే):శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో శ్రీ మత్స్యగిరీంద్ర స్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి కళ్యాణ మహోత్సవానికి మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంతో కలిసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి మంగళ శాసనాలు, ఆశీర్వచనాలు అందజేశారు.అనంతరం డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలంతా సుఖశాంతులతో ఆరోగ్యకరమైన జీవనం గడపాలని, సంపదలతో,ప్రజలే కాకుండా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆ స్వామి వారిని వేసుకున్నట్టు తెలిపారు.ఈ మహోత్సవానికి ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దడమే కాకుండా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించిన పాలకవర్గాన్ని ఆయన అభినందించారు.ఈ మహోత్సవంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోరం రాజిరెడ్డి,పిసిసి సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ మండల పార్టీ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి,టెంపుల్ మాజీ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి,పాలకవర్గ సభ్యులు,వివిధ గ్రామాల సర్పంచులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎంఐఎం పార్టీకి భారీ షాక్ మాజీ మంత్రి సమక్షంలో బి ఆర్ ఎస్ లో చేరిక

కరీంనగర్,జనవరి29(వాయిస్ టుడే): 37వ డివిజన్ ఎంఐఎం పార్టీ మాజీ కార్పొరేటర్ మొహమ్మద్ షర్ఫుద్దీన్ వారి అనుచరులతో కలసి ఎంఐఎం పార్టీని వదిలి మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.వారికి ఎమ్మెల్యే గంగుల పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.మ్మెల్యే గంగుల వెంట బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్,మహ్మద్ ఫిరోజ్, మహమ్మద్ మోయిజ్ ,అఫ్రోజ్ , నాయకులు పాల్గొన్నారు.

## ఫోర్ లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్తసమ్మెను, ఫిబ్రవరి 3న నిర్మల్ జిల్లా సదస్సులను జయప్రదం చేయండి

### నిర్మల్ జిల్లాకార్మిక వర్గానికి సమ్మె పిలుపు



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జనవరి 29: నిర్మల్ జిల్లా కేంద్రంలో గల ఏఐటియుసి ఆఫీసులో కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశశీ జరిగింది" ఈ సందర్భంగా టి యు సి ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే రాజన్న. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్‌లు. మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను 2026 ఏప్రిల్ 1 నుండి అమలు చేయనున్నట్లు ప్రకటించింది. కార్మిక సంఘాల ఐక్యవేదిక.ఈ ప్రకటనను తక్షణమే ఉపసంహరించుకోవాలని మరియు ఈ 4 పెట్టుబడిదారీ అనుకూల కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేస్తోంది. కార్మికులను చైతన్యం అర్పడానికి ఫిబ్రవరి మూడవ తేదీన నిర్మల్ జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ సంఘ భవనంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలియజేస్తున్నాం. ఈ కార్పొరేట్ అనుకూల లేబర్ కోడ్‌లు 8 గంటల పనిదినాన్ని పెంచుతాయి. కార్మిక ఇన్‌స్పెక్టర్లను యజమానులకు 'సహాయకులుగా' మారుస్తాయి, సంఘటితమయ్యే హక్కు, సమ్మె చేసే హక్కు, ఉద్యోగ భద్రత హక్కు మరియు కార్మిక వర్గం కష్టపడి సాధించుకున్న ఇతర హక్కులపై దాడి చేస్తాయి. పది కేంద్ర కార్మిక సంఘాలు 4 కోడ్‌ల రద్దును మరియు ఇతర దీర్ఘకాల డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ 2026.ఫిబ్రవరి.12న ఒక రోజు అఖిల భారత సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ సమ్మెలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థల రెగ్యులర్ మరియు కాంట్రాక్ట్ కార్మికులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ రంగ కార్మికులు, సేవా రంగ మరియు నిర్మాణ రంగ కార్మికులు, స్కీమ్ కార్మికులు, మోటారు కార్మికులు, గిగ్ కార్మికులు, ఐటీ రంగ కార్మికులు అందరూ 2026 ఫిబ్రవరి 12వ తేదీన ఒక రోజు సమ్మె ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు ఎం బక్కన్న. జిల్లా కార్యదర్శి ఆర్ రామ లక్ష్మణ్. టి యు సి ఐ జిల్లా జాయింట్ సెక్రెటరీ ఎస్ గంగన్న. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ చారి.సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సుజాత.తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ బరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభ్యర్థి రజిత

వాయిస్ టుడే సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మున్సిపాలిటీలో రాజకీయ సందడి మొదలైంది. తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరఫున 19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా ఎం.రజిత పద్మశాలి బరిలోకి నిలిచింది. ఈ మేరకు పార్టీ ముఖ్య నాయకుల సమక్షంలో ఆమె అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ అణగారిన వర్గాల గొంతుక అని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను వివరించారు. రాజ్యాధికారమే లక్ష్యమని, "ఏ కులం జనాభా ఎంత ఉంటే, ఆ కులానికి అంతే రాజ్యాధికారం దక్కాలి" అన్నదే తమ పార్టీ ప్రధాన సిద్ధాంతమన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఉచిత విద్య, ఉచిత వైద్యం అమలు చేయడమే తొలి ప్రాధాన్యతగా పనిచేస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు సరిగా పనిచేయని పక్షంలో వారిని వెనక్కి పిలిచే అధికారం ప్రజలకు కల్పించాలనే ఉద్దేశంతో రైట్ టు రీకాల్ కోసం పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. అలాగే ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే తమ పార్టీ అభ్యర్థిని కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మైనార్టీ అధ్యక్షుడు నవాజ్, టౌన్ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు ఎం.రాజు, రాములు రజితకు తమ మద్దతును ప్రకటించారు.


# మునిసిపల్ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ జెండా ఎగరవేస్తాం..

## బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు గీతా మూర్తి



హుస్నాబాద్, వాయిస్ టుడే ప్రతినిధి జనవరి 30 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో హుస్నాబాద్ పట్టణంలోని బీజేపీ పార్టీ ఎన్నికల కార్యాలయంలో బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు విలేకరుల సమావేశం ఏర్పాటు చేయగా, ఈ విలేకరుల సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు గీతామూర్తి గారు హాజరై, మాట్లాడారు దేశంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతుందని, పట్టణాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం సహకారంతో జరుగుతుందని, హుస్నాబాద్ పట్టణ ప్రజలు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ పార్టీని ఆదారించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిందని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రజల నయవంచాను గురి చేసిందని, ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఈ మునిసిపల్ ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. బీఆర్ఎస్ జీరో అయి, ఢీలా పడిందని, ఆ పార్టీని పరిగణలోకి తీసుకోకూడదని చెప్పారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో హుస్నాబాద్ పట్టణాన్ని మోడల్ టౌన్ గా తీర్చిదిద్దామని తెలిపారు.

హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రభారీ విజయ్ కుమార్ మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణంలో భారతీయ జనతా పార్టీకి సానుకూల వాతావరణం ఉందని, గత రెండు రోజులుగా దరఖాస్తులు ఆహ్వానిస్తే, విద్యావంతులు, యువత, పెద్దయెత్తున పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ హుస్నాబాద్ గడ్డపై జెండా ఎగరవేస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణంలో అభివృద్ధి కుంటు పడిందని, పట్టణాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం సహకారంతో జరుగుతుందని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో హుస్నాబాద్ పట్టణానికి భారీ నిధులు తీసుకువచ్చి హుస్నాబాద్ పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, మాజీ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొమ్మ గాని సతీష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి పృథ్వీరాజ్, హుస్నాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శి గాదాసు రాంప్రసాద్, కార్యదర్శి వడ్డెపల్లి లక్ష్మయ్య, బీజేపీ నాయకురాలు లకవత్ శారద, నాయకులు ఇల్లందుల తిరుపతి , మల్లం ప్రశాంత్, ఎర్రబెల్లి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



## సదాశివంపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థుల జాబితా విడుదల చేసిన టి జి ఐ సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

సంగారెడ్డి జిల్లా (వాయిస్ టుడే ) సంగారెడ్డి జిల్లా సదాశివంపేట్ మున్సిపాలిటీకి సంబంధించి కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థుల జాబితాను గురువారం నాడు కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించి అభ్యర్థుల జాబితాను టీజీఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ఖరారు చేసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆదేశానుసారం గెలిచే వారికే టికెట్లు కేటాయించడం జరుగుతుందని. టిక్కెట్టు రా రానివారు నిరాశకు గురి కావద్దని కాంగ్రెస్ పార్టీలో అందరికీ న్యాయం జరుగుతుందని పార్టీ కేటాయించి నా అభ్యర్థులను గెలిపించుకోవాల న్నారు. పట్టణంలోమొత్తం 26 వార్డులకు గాను, 25 వ వార్డులకు పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాలను అధికారికంగా ప్రకటించారు.

వార్డు 1: పిల్లోడి విశ్వనాథం, వార్డు 2: ఎరుకల నర్సింహులు, వార్డు 3: రేణుక, వార్డు 4: ఎండీ. మోయిజ్, వార్డు 5: ఖుతేజా ఫాతిమా, వార్డు 7: పాతదొడ్డి అనిత, వార్డు 8: సిహెచ్. రేణుక, వార్డు 9: బి. అరుణ్ కుమార్, వార్డు 10: కంది నర్సింహులు గౌడ్, వార్డు 11: గోపి ప్రియాంక, వార్డు 12: పులిమామిడి మమత, వార్డు 13: పిల్లోడి భవాని, వార్డు 14: రాయపాడు స్వరూప, వార్డు 15: గౌసియా బేగం, వార్డు 16: కొత్తగొల్ల చంద్రశేఖర్, వార్డు 17: ఎండీ. షాజీ, వార్డు 18: ఆకుల నిఖిత, వార్డు 19: పట్లూరి రోజా, వార్డు 20: మునిపల్లి అంజమ్మ, వార్డు 21: ఎండీ. వాజీద్, వార్డు 22: పతనం విజయ లక్ష్మి, వార్డు 23: వానగంటి లక్ష్మి ప్రియ (ముగిటి లక్ష్మి ప్రియ), వార్డు 24: ఎండీ. కలీమ్, వార్డు 25: కే. శంకర్ గౌడ్, వార్డు 26: కావులే హారిక.

6వ వార్డు అభ్యర్థి ఎవరనేది పెండింగ్‌లో ఉంది. అభ్యర్థులందరూ తమ తమ వార్డులలో ప్రచారాన్ని వేగవంతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. స్థానిక సమస్యల పరిష్కారం, పట్టణ అభివృద్ధిని ప్రధాన అజెండాగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల బరిలోకి దిగుతోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి. నియోజకవర్గ పెద్దలు ఆంజనేయులు. పార్టీ నాయకులు కార్యకర్తలుపాల్గొన్నారు.



## బోరుపట్ల సొసైటీ కార్యకలాపాలపై విచారణ చేపట్టాలి

### గీత పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షులు అంజా గౌడ్

నర్సాపూర్ (వాయిస్ టుడే) : గీత పారిశ్రామిక సహకార సంఘం సొసైటిపై కార్యకలపాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు విచారణ చేపట్టాలని గీత పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షులు అంజగౌడ్ అన్నారు, గురువారం నాడు దౌల్తాబాద్ లో స్థానిక విలేకరుల సమావేశంలో గీత పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షులు అంజా గౌడ్ మాట్లాడుతూ హత్నూర మండలంలోని బోర్పట్ల గ్రామంలో గీత పారిశ్రామిక సహకార సంఘం 15 మంది సభ్యులతో సొసైటీ లైసెన్స్ గత 40 సంవత్సరాలుగా కొనసాగుతుందన్నారు. ఈ మధ్యకాలం 10 సంవత్సరాలు నుండి సొసైటీలో కొందరు సభ్యులు వారి ఇష్టానుసారంగా కార్యకలాపాలు కొనసాగిస్తూ సంఘానికి నష్టం చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు . సొసైటీలో ఇలాంటిఏజెండా తీర్మానాలు లేకుండా వారికి అనుకూలంగా మలుపుకుంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు తాను నిలదీయడంతో దాడికి పాల్పడడంతో పాటు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి బోర పట్ల గ్రామానికి వచ్చి గ్రామస్తుల మరియు సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామ ప్రజల సమక్షంలో సొసైటీ కార్యకలాపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తగు న్యాయం చేయాలని బోర్పట్ల గీత పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షులు అంజా గౌడ్ కోరారు.

## మాట తప్పకుండా పని చేసి చూపించే తత్వం మంత్రి పొన్నం ప్రభాకర్‌ది..

### హుస్నాబాద్ ఏఎంసి అభివృద్ధికి 8 కోట్ల 50 లక్షల 50వేల రూపాయలు

### హర్షం వ్యక్తం చేసిన రైతులు ప్రజలు మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి



హుస్నాబాద్, వాయిస్ టుడే ప్రతినిధి జనవరి 30 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మార్కెట్ యార్డులో అభివృద్ధి పనుల కోసం 805.50 లక్షల రూపాయలకు పరిపాలన అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ ఏఎంసి పరిధిలోని మార్కెట్ యార్డు హుస్నాబాద్ లో గోడౌన్ లు ,కవర్డ్ షెడ్డులు ,మార్కెట్ లోతట్టు ప్రాంతాల్లో ఉపరితల సీసీ పనుల కోసం 335.00 లక్షలు రూపాయలు మార్కెట్ యార్డు లో బ్యాలెన్స్ కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం 25.00 లక్షల రూపాయలు,మార్కెట్ యార్డు లో విద్యుదీకరణకు 26.00 లక్షలు, మార్కెట్ యార్డులో కాంపౌండ్ వాల్ మరియు ఇంటర్నల్ బాక్స్ డ్రైన్ వెంబడి ఓపెన్ డ్రెయిన్ నిర్మాణానికి 400.00 లక్షల రూపాయలు,గోడౌన్ లకు షెడ్డులు ,జూజుష గట్టర్లు, డౌన్ స్పౌట్ లను కవర్ చేయడానికి ఎంఎస్ గట్టర్లను అందించడానికి 19.50 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో మార్కెట్ యార్డు అభివృద్ధికికి భారీగా నిధులు కేటాయించడం పట్ల రైతులు ,మార్కెట్ కమిటీ చైర్మన్ పాలకవర్గం హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. హుస్నాబాద్ మార్కెట్ యార్డు కి నిధులు 8.5 కోట్ల రూపాయలు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ బంక చందు మాజీ సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, డైరెక్టర్లు తణుకు ఆంజనేయులు, మడప యాదవరెడ్డి,ఖుత్బొద్దీన్, కరంటోతూ రవి, బాలయ్య,బొంగోని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల ఫిర్యాదుల కోసం 9381082501 నంబర్‌ను సంప్రదించాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జనవరి 29: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు--2026ను పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా కేంద్రంలోని ఐడిఓసి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన మీడియా సెల్ సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు, ఎంసిఎంసి అంశాలు, ఇతర ఎన్నికల ఫిర్యాదులపై ప్రజలు కంట్రోల్ రూమ్ నంబర్ 9381082501ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్‌లో 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉండి, అందిన ప్రతి ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేసి, సంబంధిత అధికారుల ద్వారా తక్షణమే తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, నిబంధనల మేరకు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కట్టుదిట్టంగా అమలు చేస్తూ, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు.



## ఆత్మీయ సమ్మేళన సన్మాన సభ

### ఝరసంగం మండల తహశీల్దార్ సి భాస్కర్

ఝరాసంగం జనవరి 29 (వాయిస్ టుడే) : ఝరసంగం మండల కేంద్రంలో మండల రజక సంఘం ఆధ్వర్యంలో సన్మాన సభ కార్యక్రమంలో పాల్గొని నూతన సంవత్సర కేతకీ రజక సంఘం క్యాలెండర్ ను ఆవిష్కరించారు,అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు,నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు రాజకీయంగా ముందుకు ఎదగాలి అని కోరారు. అనంతరం కేతకీ రజక సంఘం తరపున ముఖ్య అతిథిగా విచ్చేసిన తహశీల్దార్ గారిని మండల రజక సభ్యుల ఆధ్వర్యంలో సన్మానం చేయడం జరిగింది. అలాగే నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ ,వార్డ్ మెంబర్ లను సన్మానించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నూతన బిడెకన్న సర్పంచ్ రవీందర్, బార్దీపూర్ ఉప సర్పంచ్ తుకారాం మరియు చిల్కేపల్లి , చిలేపల్లి, ఎల్గోయ్ వివిధ గ్రామాల్లో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు మరియు మండల నాయకులు దత్తు,రాజ్ కుమార్,నాగన్న, సంగమేష్, శ్రీశైలం,హనుమంతు, నర్సింలు ,యాదుల్, బస్వరాజ్, శివకుమార్, ఎల్గోయ్ రాజు కుమార్ ,జనార్దన్ ,మరియు వివిధ గ్రామాల రజకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం కబ్ క్రీడలు విజయవంతం చేయండి

### ఎంపీడీవో ఎం శేషగిరి శర్మ

మిర్యాలగూడ జనవరి 29( వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2025 - 26 క్రీడలను విజయవంతం చేయాలని క్రీడల కన్వీనర్ ఎంపీడీవో శేషగిరి శర్మ తెలిపారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ మండల స్థాయి టోర్నమెంట్ల నిర్వహణకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మిర్యాలగూడ వేదికగా తేది ఈ నెల 30వ తేదీన ఉదయం 9.00 గంటలనుండి మండల స్థాయి క్రీడా పోటీలు అథ్లెటిక్స్,కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ కరాటే క్రీడలు నిర్వహించుటకు నిర్ణయించనైనది అని వివరించారు క్రీడల్లో యోగ,చెస్ జిల్లా స్థాయిలో ఉండునుఅని తెలిపారు. క్రీడాకారులు ప్రజా ప్రతినిధులు అధికారులు అందరూ సహకారం అందించి విజయవంతం చేయవలసిందిగా కోరారు.

## నందికొండ మున్సిపాలిటీలో33నామినేషన్లు

నాగార్జునసాగర్ జనవరి 29వాయిస్ టుడే ప్రతినిధి : నందికొండ మున్సిపాలిటీలో 33నామినేషన్లు వచ్చినట్లు నందికొండ మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి తెలిపారు మొదటి రోజు 6 నామినేషన్ రాగా రెండవ రోజు గురువారము 27 నామినేషన్లు దాఖలు అయ్యాయి మొత్తం 33 నామినేషన్లు వచ్చాయి ఇందులో ఇండిపెండెంట్ లు ఇద్దరు ఉండగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 14, బి ఆర్ ఎస్ పార్టీ12 అభ్యర్థులు బిజెపి అభ్యర్థులు నలుగురు ఆమ్ ఆద్మీ పార్టీ ఒకరు నామినేషన్ దాఖలు చేసినట్టుగా తెలిపారు.



## మున్సిపల్ బరిలో ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి

### 18 వ వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు..

### 18వార్డు ప్రజలు ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థన

హుస్నాబాద్, వాయిస్ టుడే ప్రతినిధిహుస్నాబాద్ జనవరి 30: రాష్ట్రంలోమున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది దీంతో హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల వాతావరణం రోజుకు వేడెక్కుతుంది మున్సిపల్ ఎన్నికలలో తీవ్ర పోటీ నెలకొంది అయితే ఈసారి మున్సిపల్ పరిధిలోని 18వార్డులో లో ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి బరిలోదిగేందుకు సిద్ధమవుతున్నారు మున్సిపల్ రాజకీయాల్లో ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డితనదైన శైలిలో ప్రచారం చేసేందుకు సిద్ధమవుతున్నారు. రాజకీయాల్లో వార్డు ప్రజల్లో ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి మంచి పేరు ఆదరణ ఉంది గతంలో మున్సిపల్ 4 వార్డు కౌన్సిలర్ గా మున్సిపల్ వైస్ చైర్మన్ గాప్రజలకు సేవలు అందించారువార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని నమ్మకం ప్రజల్లో విశ్వాసం ఏర్పడింది ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి కిఅన్ని వర్గాల ప్రజలతో అందరితో సత్సంబంధాలు కలిగి ఉన్నారు వార్డులో తిరుగుతూ ప్రజల మద్దతు కల్పించాలని కోరుతున్నారు త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందేందుకు ప్రజల సహకారం కావాలని ప్రణాళిక వైపుగా సాగుతున్నారు వారి పయనం విజయపతంలోకి రావాలని కౌన్సిలర్ గా విజయదుందుభి మోగించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డిని కౌన్సిలర్ గా గెలిపిస్తే ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తామని ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని వార్డు సమస్యలను ప్రభుత్వం దృష్టికి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇస్తామని అభిప్రాయం వ్యక్తం చేశారు. వార్డ్ ప్రజలకు మంచి చేయాలని తపనతో ముందుకు నిస్వార్థంగా ప్రజలకు పాలన అందించుటకు ముందుకు వస్తున్నామని మేము వేయబోయే అడుగులకు దారి మీ ఓటు అనిమమ్మల్ని ఆశీర్వదించి అధిక మెజారిటీతో గెలిపించుకోగలరని వార్డు ప్రజలను సదా కోరుతున్నారు.

## రైతులకు బాయర్ కంపెనీవారి వ్యవసాయ పంటలపై అవగాహనా కార్యక్రమం

మాడ్గులపల్లి, జనవరి 29( వాయిస్ టుడే): మాడుగులపల్లి మండలం పూసలపహాడ్ గ్రామంలోపూసలపహాడ్, గజాలాపురం, గౌండ్లగూడ, కంబాల పల్లి గ్రామాల రైతులకు గురువారం రోజున బాయర్ కంపెనీ వారి ఆధ్వర్యంలో స్థానిక రైతులకు వ్యవసాయ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కంపెనీకి సంబందించిన అధికారులు మాట్లాడుతూ రైతులు నాట్లు వేసిన నాలుగైదు రోజుల నుండే పంట పొలాలకు తెగుళ్ళు వస్తాయని వరి ఆకులపై మొలిపురుగు, పంట వేరు భాగంలో తుంగ జాతి, గడ్డి జాతి లాంటివి కలుపు ఏపుగా పెరిగి వరి ఎదుగు దలను నాశనం చేసి పంట దిగుబడిని తగ్గిస్తాయని అన్నారు. రైతులు బాయర్ కాపెనికి సంబందించిన పురుగు మందులు కౌన్సిల్, బికోట (గులికలు)వయగో, నేటివో, అంట్రోకార్ వంటి మందులు వాడితే పంటలోని కలుపును ఎదగకుండా చేసి పురుగులను నాశనం చేసి పంట దిగుబడిని పెంచుతానికి ఈ మందులు ఉపయోగ పడతాయాని అన్నారు. ఈ కార్యక్రమంలో బాయర్ కంపినికి సంబందించిన సిబ్బంది సీ.ఏ.ఏమ్ నారాయణ రెడ్డి, సేల్స్ ఆపిసర్ హేమంత్, సూపర్ వైజర్ పరంగి రాములు రైతులు పాల్గొన్నారు.





## హుస్నాబాద్ మున్సిపాలిటీలో రెండవ రోజు 26నామినేషన్లు

హుస్నాబాద్, వాయిస్ టుడే ప్రతినిధి జనవరి 30 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటీ మున్సిపల్ సాధారణ ఎన్నికలలో భాగంగా రెండవరోజు 26మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ వేసిన వారి వివరాలు 12వ వార్డు గోనెల మధుకర్ బిఆర్ఎస్,15వ వార్డు మంజుల చిత్తారి,16వ వార్డు వైద్యం కిరణ్ ప్రసాద్ కాంగ్రెస్, 11వ వార్డు పచ్చిమట్ల రవీందర్ బిఎస్పి,5వ వార్డు రాజ్ కుమార్ అబ్బరబోయిన– బీజేపీ,6వ వార్డు భూక్య లక్ష్మణ్ సింగ్ బిఆర్ఎస్, కూతాటి స్వప్న,1 వ వార్డ్ బిఆర్ఎస్,బూరుగు లత – 02 వ వార్డ్ కాంగ్రెస్,తోట స్వరూప –1 వ వార్డ్ – బీజేపీ,బూర వెంకన్న – 4 వ వార్డ్ బిఆర్ఎస్, పి.సంపత్ కుమార్ –11 వ వార్డ్ బిఆర్ఎస్,పి.వర ప్రసాద్, –11 వ వార్డ్ – కాంగ్రెస్,మేకల వికాస్ యాదవ్ –20 వ వార్డ్ బిఆర్ఎస్,బండి పుష్ప – 19 వ వార్డ్ బిఆర్ఎస్, భాషవేని లక్ష్మీ1 వ వార్డ్ – ఇండిపెండెంట్,గడిపె శోభ – 10 వ వార్డ్ – ఇండిపెండెంట్,ఐలేని అనిత – 18 వ వార్డ్ – కాంగ్రెస్,లక్కిరెడ్డి తిరుమల – 3 వ వార్డ్ – బీజేపీ,గందె చిరంజీవి – 13 వ వార్డ్ బిఆర్ఎస్,బత్తుల శంకర్ బాబు –9 వ వార్డ్ – బీజేపీ,రజిత కొండ –3 వ వార్డ్ – కాంగ్రెస్,రాజు బొలిశెట్టి–5 వ వార్డ్ – కాంగ్రెస్,చిత్తారి పద్మ 7వ వార్డ్ కాంగ్రెస్,సావుల మంజుల 10వ వార్డ్ కాంగ్రెస్ నెమలికొండ లత 8వ వార్డు బిఆర్ఎస్,వేల్పుల కళ్యాణి 8 వ వార్డ్ బీజేపీ అభ్యర్థులగా నామినేషన్ వేసినట్లు తెలిపారు.



## స్కై లైన్ దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన ఎస్ఐ లు అశోక్,కృష్ణా ప్రసాద్

ముదిగొండ మండలం జనవరి 29 (వాయిస్ టుడే) : మండల కేంద్రమైన ముదిగొండలో గల పోలీసు స్టేషనులో స్దానిక యస్ఐలు అశోక్, కృష్ణా ప్రసాద్ స్కైలైన్ దినపత్రిక క్యాలెండర్ గురువారం ఆవిష్కరించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో డిజిటల్ మీడియాలోను స్కైలైన్ న్యూస్ దినపత్రిక ప్రత్యేకమైనదిగా నిలిచిందని పత్రిక రంగంలో సరికొత్త మార్పులకు స్కై లైన్ న్యూస్ పేపర్ చుట్టిందని అన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేయడంలో పత్రికలు ముందు ఉన్నాయని ప్రజా సమస్య పరిష్కరించడంలో ప్రజలకు ప్రభుత్వానికి వారదిగా పని చేయాలని జర్నలిస్టులు బాధ్యతగా పనిచేసి సమాజానికి ఉపయోగపడాలని అన్నారు. కార్యక్రమంలో స్కై లైన్ రిపోర్టర్ నరేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి సీఎస్ఆర్ పనులకు గుర్తింపుగా బీకన్ ఆఫ్ హోప్ అవార్డు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యధిక సీఎస్ఆర్ పనులు చేసినందుకు గుర్తింపు**

**జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అవార్డు బహూకరణ**

**ఐదేళ్లలో 15 కోట్ల రూపాయలకుపైగా సిఎస్ఆర్ నిధులతో గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు చేయూత**



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జనవరి 29: సింగరేణి సామాజిక భాధ్యత కార్యక్రమాలకు మరో గుర్తింపు లభించింది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పట్టణాలు, గిరిజన గ్రామాల్లో చేపట్టిన సీఎస్ఆర్ పనులకు ప్రశంసగా బీకన్ ఆఫ్ హోప్ అనే అవార్డును పొందింది. ఇటీవల భద్రాచలం ట్రైబల్ భవన్ లో జరిగిన సీఎస్ఆర్ సమిట్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఈ అవార్డును సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్ వెల్ఫేర్ అండ్ సీఎస్ఆర్ జి.వెంకట కిరణ్ కుమార్ కు, సీఎస్ఆర్ అధికారి గట్టు స్వామికి అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ సేవలను ప్రశంసించారు. సింగరేణి సంస్థ గత ఐదేళ్ల కాలంలో 15 కోట్ల రూపాయల సీఎస్ఆర్ నిధులు వెచ్చించి పాఠశాలల భవనాలు, రోడ్లు, డ్రైనేజీలు వంటి ప్రజోపయోగమైన అనేక పనులను చేపట్టిందని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యధిక సీఎస్ఆర్ పనులు చేపట్టినందుకు గుర్తింపుగా ఈ అవార్డును సింగరేణి సంస్థకు బహూకరిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఇదే విధంగా సింగరేణి సంస్థ అన్ని జిల్లాల్లోనూ కోట్లాదిరూపాయలు వెచ్చించి కనీస మౌలిక సదుపాయాల కల్పనకు విద్యా, వైద్యాభివృద్ధికి సీఎస్ఆర్ నిధులతో సేవలందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభించిన సర్పంచ్,ఉప సర్పంచ్

**కొల్లూర్ సర్పంచ్ చింతల్ గట్టు శివరాజ్, ఉప సర్పంచ్ దత్తు**



ఝరాసంగం జనవరి 29 (వాయిస్ టుడే): ఝరాసంగం మండల పరిధిలోని కొల్లూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించిన సర్పంచ్ చింతల్ గట్టు శివరాజ్, ఉప సర్పంచ్ సంగీత దత్తు . గ్రామ క్షేత్ర సహాయకుడు సుభాకర్ ఉపాధి హామీ కూలీలు చేత మట్టి పూడిక పనులు ప్రారంభం చేయడానికి సర్పంచ్ చింతల్ గట్టు శివరాజ్ ఉప సర్పంచ్ దత్తు సెక్రటరీ శ్రీనివాస్ చేత పూజ చేపించి టెంకాయలు కొట్టించి ప్రారంభం ప్రారంభం చేసినారు. ఈ ఉపాధి హామీ పనుల ప్రారంభ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గ్రామ అధ్యక్షులు డప్పుర్ సంగమేష్, పెన్ గన్ ఎడిటర్ రాయికోటి నర్సిములు ,వార్డు సభ్యులు పారమ్మ మాణయ్య, సి ప్రకాష్, మాజీ వార్డ్ సభ్యులు ఎం విష్ణు,యువనాయకులు హరి, రామ్, సి హెచ్ సంగమేష్ ఉపాధి కూలీలు మహిళాలు తధితరులు పాల్గోని ఉపాధి హామీ పనులను ప్రారంబించడము జరిగింది.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

**స్కానింగ్ కేంద్రాల పనితీరుపై పర్యవేక్షించాలి**

**ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యధిక ప్రసవాలు జరిగేలా కార్యాచరణ**

**ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల జిల్లా, (వాయిస్ టుడే ప్రతినిధి) : జిల్లా పరిధిలో లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. స్కానింగ్ సెంటర్లు, నూతన ప్రైవేట్ దవాఖానలకు అనుమతుల జారీ, నవజాత శిశు మరణాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సుదీర్ఘ సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షించాలని, భ్రూణ హత్యలు జర్గకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పీ సీ ఎన్ బీ యాక్ట్ సంబంధించి ఎప్పటికప్పుడు జిల్లా అడ్వైజర్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. భ్రూణ హత్యలతో మగ, ఆడ పిల్లల లింగ నిష్పత్తిపై ప్రభావం చూపుతుందని తెలిపారు

ఆడ అయినా.. మగ అయినా ఒకటేనని, ఇద్దరూ సమానమేనని స్పష్టం చేశారు. దీనిపై వైద్య ఆరోగ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. స్కానింగ్ కేంద్రాల పనితీరుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే పరిణామాలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించేందుకు జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల రేడియాలజిస్ట్ లు, ల్యాబ్ టెక్నిషియన్లతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో నూతన ఆసుపత్రుల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిబంధనల ప్రకారం చేయాలని, ఆయా ఆసుపత్రులకు మున్సిపల్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య శాఖ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. అన్ని అనుమతులు ఉన్న వాటికి నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు జారీ చేస్తామని తెలిపారు.

**నవజాత మరణాల జరగకుండా చర్యలు**

జిల్లాలో నవజాత మరణాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలో గత నాలుగు నెలల్లో జరిగిన నవజాత శిశువుల మరణాలపై సమీక్ష చేశారు. ఆయా శిశువుల తల్లి ఆరోగ్య పరిస్థితి, ఇంతకుముందు ఎందరు పిల్లలు ఉన్నారు. నవజాత శిశువుల మరణానికి కారణాలపై వివరాలు సేకరించారు. పిల్లల జననాల మధ్య కచ్చితంగా నిర్ణీత సమయం ఉండాలని, దీంతో తల్లి, పుట్టబోయే బిడ్డకు ఎంతో మేలని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో అవగాహన కల్పించాలని సూచించారు. నవజాత పిల్లల సంరక్షణ, పాలు పట్టించడం, మిగితా అంశాలపై బాలింతలు, కుటుంబ సభ్యులకు వివరించాలని తెలిపారు.

**సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి..**

ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలపై విస్తృత అవగాహన కల్పించాలని, అత్యధికంగా ప్రసవాలు జరిగేలా తీసుకోవాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహిం చాలని, అత్యవసరమైన పక్షంలోనే సీ సెక్షన్ ఆపరేషన్లు చేయాలని ఇంచార్జి కలెక్టర్ సూచించారు. గర్భిణులపై వైద్యులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, నిరంతరం వారి ఆరోగ్య పరిస్థితిపై పర్యవేక్షణ కొనసాగిం చాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువుల మరణాలు జిల్లాలో జరగకూడదని పేర్కొన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు, డాక్టర్లు, ఆశ కార్యకర్తలు నిత్యం గర్భిణులతో మాట్లాడాలని వారి కుటుంబ ఆరోగ్య చరిత్ర ఇతర వివరాలు అందుబాటులో ఉండాలని సూచించారు. సమీక్ష సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్, డీఎస్పీ నాగేంద్రాచారి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరెడ్డి, ఐఎంఏ ప్రెసిడెంట్ శోభారాణి, ఎన్జీఓ ప్రతినిధి భాస్కర్, ఆయా మండలాల వైద్యాధికారులు తదితరులు ఉన్నారు.



## వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ పరిశీలన

వేములవాడ/రాజన్న సిరిసిల్ల జిల్లా : మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ గురువారం పరిశీలించారు. హెల్ప్ డెస్క్, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశీలనలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, నోడల్ అధికారులు గీత, నవీన్ కుమార్, భారతి, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, టీపీఓ అన్సార్ తదితరులు ఉన్నారు.

## నేటితో ముగియనున్న మున్సిపల్ నామినేషన్ల పర్వం

**మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి వెల్లడి**



నాగార్జున సాగర్ జనవరి 29 వాయిస్ టుడే ప్రతినిధి: నందికొండ మున్సిపాలిటీ ఎన్నికల నగారా మోగడంతో రెండు రోజులుగా సాగుతున్న నామినేషన్ల ప్రక్రియ నేటితో ముగియనుంది, మున్సిపాలిటీలోని వివిధ వార్డులకు సంబంధించి కౌన్సిలర్ పదవులకు పోటీ పడే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సమర్పించడానికి శుక్రవారం సాయంత్రం వరకు ఆఖరి గడువు అని మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం నామినేషన్ల ప్రక్రియను అత్యంత పారదర్శకగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు, నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు,ఎన్నికల నిర్వహణలో ప్రజలు,రాజకీయ పార్టీలు సహకరించాలని ఆయన కోరారు.

## శాంతి భద్రతల పర్యవేక్షణలో ఎక్కడ రాజీ పడేది లేదు

**హుజూర్ నగర్‌లో మున్సిపల్ నామినేషన్ల కేంద్రాలను పరిశీలించిన కోదాడ డిఎస్పి శ్రీనివాసరెడ్డి**



హుజూర్ నగర్ జనవరి 29 (వాయిస్ టుడే ప్రతినిధి): సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని నామినేషన్ కేంద్రాలను కోదాడ డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సిఐ చరమందరాజుతో కలిసి గురువారం నాడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నామినేషన్ హాల్స్, అభ్యర్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కులను వారు తనిఖీ చేశారు.శాంతి భద్రతలో భాగంగా నామినేషన్ల ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలను అభ్యర్థులు తూచా తప్పకుండా పాటించాలని డిఎస్పీ సూచించారు. నామినేషన్ పత్రాల్లో ఎటువంటి తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలని, ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు.ప్రజాస్వామ్య పద్ధతిలో అభ్యర్థులందరూ ప్రశాంతంగా తమ నామినేషన్లను దాఖలు చేసుకోవాలి. శాంతి భద్రతల విషయంలో ఎక్కడ రాజీ పడే ప్రసక్తి లేదని డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఈ సందర్భంగా తెలిపారు ఈ పరిశీలన కార్యక్రమంలో పట్టణ ఎస్ ఐ బండి మోహన్. మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్ ఏఎస్ఐ బలరాంరెడ్డి మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# నందికొండలో మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

**పకడ్బందీ ఏర్పాట్లతో పారదర్శక పోలింగ్**

**నామినేషన్ల కేంద్రాలు,పోలింగ్ బూత్‌లు, కౌంటింగ్ ప్రక్రియను**

**ఆకస్మికంగా తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ**





నాగార్జునసాగర్ జనవరి 29 వాయిస్ టుడే ప్రతినిధి: నందికొండ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధమైంది, రెండవ రోజు నామినేషన్ ప్రక్రియలో భాగంగా గురువారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నందికొండ మున్సిపాలిటీలో పర్యటించి,ఎన్నికల కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు,ముందుగా నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించారు. అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించే సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు,అనంతరం స్థానిక జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు,ఓటర్లకు కనీస సదుపాయాలు మంచినీరు,కల్పించాలని సూచించారు,సమస్యాత్మక కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు,కౌంటింగ్ ప్రక్రియ కోసం జూనియర్ కాలేజీలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి,భద్రతా ప్రమాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు,ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు, కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకతతో కూడి ఉండాలని,ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని అప్రమత్తం చేశారు ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ దండ శ్రీనివాస్ రెడ్డి,పట్టణ ఎస్సై ముత్తయ్య మున్సిపల్ అధికారులు,ఎన్నికల విభాగం సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.





# రాష్ట్రానికి నిధులే ఇవ్వలేని వాళ్లు ఎలా అభివృద్ధి చేస్తారు

## మాజీ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, జనవరి 29 (వాయిస్ టుడే): గత రెండేళ్లుగా తెలంగాణ రాష్ట్రానికి గానీ, కరీంనగర్ నగరానికి గానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క రూపాయి కూడా నిధులు తీసుకురాలేదని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్రంగా విమర్శించారు. రెండేళ్లలో అభివృద్ధి చేయలేని ప్రభుత్వాలు రానున్న మూడేళ్లలో ఏమి అభివృద్ధి చేస్తాయో ప్రజలు ఆలోచించాలని ఆయన అన్నారు. 47వ, 21వ డివిజన్ల బీఆర్ఎస్ అభ్యర్థులు చల్ల స్వరూప రాణి -- హరిశంకర్‌ల నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగుల కమలాకర్ ముందుగా రాంనగర్‌లోని రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ ర్యాలీగా నామినేషన్ కేంద్రానికి చేరుకుని అభ్యర్థులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ నగరాన్ని 1650 కోట్ల రూపాయలతో స్మార్ట్ సిటీ తరహాలో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గానీ, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గానీ కరీంనగర్‌కు ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. పొన్నం ప్రభాకర్ అయినా, బండి సంజయ్ అయినా నగర అభివృద్ధికి ఏమాత్రం కృషి చేయలేదని విమర్శించారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పాలనలో పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాదని, బీజేపీ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రజల సంక్షేమం కోసమే ఏర్పడిన పార్టీ టీఆర్ఎస్ (బీఆర్ఎస్) అని పేర్కొంటూ, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్‌గా చల్ల స్వరూప రాణి హరిశంకర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని ప్రశంసించారు. ఆమె ప్రజల ఇంటి బిడ్డగా ఉండి నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. అందుకే ఆమెను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ మేయర్‌గా ఇంత అభివృద్ధి చేస్తే, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మేయర్ పీఠం కైవసం చేసుకున్న తర్వాత నగరాన్ని మరింత వేగంగా అభివృద్ధి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో గంగుల కమలాకర్ సోదరులు గంగుల సుధాకర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉదయం భారాసలోకి..
## రాత్రి కాంగ్రెస్ గూటికి..





కోరుట్ల, మెట్‌పల్లి: కౌన్సిలర్ టికెట్ కోసం ఓ నాయకుడు ఉదయం ఒక పార్టీలో చేరగా, రాత్రికి మరో పార్టీ గూటికి చేరుకోవడం జగిత్యాల జిల్లా కోరుట్లలో చర్చనీయాంశమైంది. కోరుట్ల పట్టణంలోని 8వ వార్డు నుంచి పోటీ చేసేందుకు పట్టణానికి చెందిన తోట గంగాధర్ కొద్ది రోజులుగా కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ వార్డు నుంచి పార్టీ తరఫున మరొకరు యత్నిస్తుండటంతో టికెట్ రాదని భారాసలో చేరాలని నిర్ణయించుకున్నారు. గురువారం ఉదయం కోరుట్లలోని గంగాధర్ ఇంటికి వెళ్లిన భారాస ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ ఆయనతో పాటు మద్దతుదారులకు కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ విషయం కాంగ్రెస్ ముఖ్య నాయకులకు తెలియడంతో రాత్రి గంగాధర్‌ను మెట్‌పల్లిలోని పార్టీ కార్యాలయానికి పిలిపించారు. 8వ వార్డు అభ్యర్థిగా ప్రకటిస్తూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు ఆయనకు కండువా కప్పి తిరిగి పార్టీలోకి చేర్చుకున్నారు.



## సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద భక్తుల రద్దీ

మేడారం : మహా జాతరలో ప్రధాన ఘట్టమైన సమ్మక్క ఆగమనంతో జనమంతా భక్తిభావంతో పులకించిపోయారు. అమ్మ రాకతో గద్దెలు నిండుగా మారి.. ఆధ్యాత్మిక శోభను సంతరించుకొన్నాయి. భక్తులు ఎత్తు బంగారం మొక్కులను చెల్లించుకున్నారు. సమ్మక్క-సారలమ్మలను దర్శించుకొనేందుకు గురువారం లక్షలాదిగా తరలివచ్చారు. మేడారంలోని వీధులు కనుచూపు మేర జనంతో కిక్కిరిసాయి. ఆర్టీసీ ప్రాంగణం, ప్రైవేటు వాహనాల పార్కింగ్ స్థలాలు నిండుగా కనిపించాయి. జంపన్నవాగు తీరం జనసంద్రంగా మారింది. జల్లు స్నానాలతో వాగు పుష్కరిణిని తలపించింది. రద్దీ నేపథ్యంలో అన్నిశాఖల అధికారులు తగిన విధంగా కార్యాచరణ ప్రణాళికలు అమలు చేశారు.

## 305 మందిని కాపాడిన సింగరేణి రెస్క్యూ బృందం

మేడారం (కాజీపేట), న్యూస్‌టుడే: మేడారం గద్దెల వద్ద, జంపన్న వాగు, ఇతర ప్రాంతాల్లో సింగరేణి రెస్క్యూ బృందం సేవలందిస్తోంది. జాతరలో గడిచిన రెండు రోజుల్లో 305 మందిని కాపాడినట్లు బృంద నాయకుడు ఎం. సమ్మయ్య తెలిపారు. గద్దెల వద్ద కొబ్బరికాయలు తలకు తగిలినవారు, కాళ్లకు కొబ్బరి ముక్కలు కోసుకుపోయినవారు, క్యూలైన్లలో ఊపిరాడనివారు ఇందులో ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. తమ బృందం సభ్యులు 24 గంటలు షిఫ్టుల వారీగా పని చేస్తున్నారని వివరించారు. భక్తులు ఎక్కువగా గద్దెల వద్ద కొబ్బరికాయలు, బెల్లం తగిలి గాయాలపాలవుతున్నారని, కొందరికి ప్రథమ చికిత్స చేస్తున్నామని, అవసరమైన వారిని ఆసుపత్రికి తరలిస్తున్నామని తెలిపారు.

### మేడారంలో శిక్షణ డీఎస్పీలు

గ్రూపు-1 ఉద్యోగాలు సాధించి శిక్షణ పొందుతున్న 112 మంది డీఎస్పీలు మేడారం మహా జాతరకు వచ్చారు. వారికి పలుచోట్ల బాధ్యతలను అప్పగించారు. శిక్షణ సమయంలోనే వనదేవతల మహా జాతరలో విధులు నిర్వర్తించే అవకాశం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వీరిలో ములుగు జిల్లా మల్లంపల్లికి చెందిన ఎ.మౌనిక కూడా ఉన్నారు. జాతర బందోబస్తు విధులకు సొంతం జిల్లాకు రావడం ఆనందంగా ఉందన్నారు.





# శ్రీ రాజ రాజేశ్వరి మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రం

## నూతన గదుల నిర్మాణానికి విరాళాలు

వేములవాడ, (వాయిస్ టుడే): వేములవాడలోని శ్రీ రాజ రాజేశ్వరి మున్నూరు కాపు (కాపు) నిత్యాన్నదాన సత్రంలో నూతనంగా నిర్మిస్తున్న గదుల నిర్మాణానికి దాతలు ఉదారంగా విరాళాలు అందజేస్తూ తమ వంతు సహకారం అందించారు. జగిత్యాల జిల్లాకు చెందిన దీటి అంజయ్య పటేల్ -- రాజమణి కుటుంబం మరియు మెట్పల్లి పట్టణానికి చెందిన పుప్పాల భూమేశ్వర్ -- పద్మ గారి కుటుంబం చెరో రూ.1,50,000 (ఒక్క లక్ష యాభై వేల రూపాయలు) విరాళంగా అందజేశారు. అలాగే వోడ్యాటి వేణుగోపాల్ -- లావణ్య కుటుంబం (మెట్పల్లి) రూ.10,116 (పది వేల ఒక్క వంద పదహారు రూపాయలు) విరాళంగా సమర్పించారు. గురువారం రోజున ఈ విరాళాలను సత్రం నిర్వాహకులకు అందజేసి, నూతనంగా నిర్మాణం జరుగుతున్న గదులకు తమ సహకారం అందించారు. ఈ సందర్భంగా దాతల సేవాభావాన్ని సత్రం వ్యవస్థాపకులు డా. కొండా దేవయ్య పటేల్ కొనియాడారు. విరాళదాతలు మరియు వారి కుటుంబ సభ్యులకు రాజన్న ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేశం సిరిపురం, రవి జంగిలి, గంగాధర్ తూము, తిరుపతి కర్రు, రమేష్ పటేల్ వంగల, పోలీస్ శ్రీనివాస్ పటేల్ తదితరులు పాల్గొని, విరాళదాతలను స్వామివారి ప్రతిమ, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు. నిత్యాన్నదాన సత్రం ద్వారా భక్తులకు నిరంతర అన్నదానం, వసతి సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ నిర్మాణ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించడం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు.



## ఇచ్చిన మాట మేరకు సమ్మక్క సారలమ్మ జాతరకు నూతన తారు రోడ్లు

- భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలి
- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

సుల్తానాబాద్, జనవరి 29 వాయిస్ టుడే: సుల్తానాబాద్ మండలం, నారాయణపూర్ గ్రామంలో గురువారం సమ్మక్క, సారలమ్మల జాతర మహోత్సవం సందర్భంగా గద్దెల పై కొలువుతీరిన వనదేవతలకు మొక్కులను చెల్లించుకున్న అనంతరం స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు, కొలువై ఉన్న గోవిందరాజు, పడిగిద్ద రాజును దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామంలో ఇచ్చిన హామీ మేరకు కోటి రూపాయల నిధులతో సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నూతనంగా తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇచ్చిన మాట నెరవేర్చడమే తప్పా మాట తప్పేది లేదని స్పష్టం చేశారు. సమ్మక్క సారలమ్మ జాతరకు విచ్చేసే భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జాతర కమిటీ వారికి ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, పన్నాల రాములు, మండల రమేష్, దేవరనేని సాగర్ రావు, కొండల్ రావు, మాధవ రావు,నాగేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకొని బ్యాంకు అధికారి ఆత్మహత్య

చుంచుపల్లి: ఉరేసుకొని ఓ బ్యాంకు అధికారి బలవన్మరణం పొందిన సంఘటన బుధవారం విద్యానగర్ పంచాయతీలో చోటుచేసుకొంది. చుంచుపల్లి పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్‌లో నివాసం ఉండే చెరుకు వేణుగోపాల్‌రావు (38) విద్యానగర్‌లోని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు రీజినల్ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఖమ్మంలో పనిచేసిన సమయంలో ఇతను మంజూరు చేసిన రుణాల బకాయిలు కొందరు చెల్లించడం లేదు. ఇటీవలే ఉన్నతాధికారులు ఇతనితోపాటు మరికొందరు అధికారులకు మెమోలు జారీచేశారు. తీవ్ర మనోవేదనకు గురైన అతను బుధవారం ఆఫీస్ నుంచి ఇంటికి వచ్చి భార్య, కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో గదిలో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తన చావుకు కొందరు బ్యాంకు అధికారులు కారణమంటూ రాసిన లేఖ లభ్యమైందని కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. అతని మామయ్య సనత్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

## మేడారం వెళ్లిన కుటుంబం.. ఆరు తులాల బంగారం మాయం

కామేపల్లి: మద్దులపల్లికి చెందిన దేవండ్ల ఉపేందర్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో మేడారం జాతరకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరనే విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు తాళం పగులగొట్టి బీరువాలోని బంగారం, నగదును దొంగిలించారు. ఇంటి పక్కన వ్యక్తులు సమాచారం ఇవ్వడంతో బాధిత కుటుంబసభ్యులు మేడారం నుంచి తిరిగి వచ్చి ఇంట్లో పరిశీలించారు. ఆరు తులాల బంగారంతోపాటు రూ. 80 వేల నగదు అపహరించారని బాధితుడు తెలిపారు. ఘటన స్థలాన్ని కామేపల్లి ఎస్సై శ్రీకాంత్ పరిశీలించి, వివరాలు సేకరించారు.

## మోపెడ్‌ను ఢీకొన్న లారీ: వ్యక్తి దుర్మరణం

సత్తుపల్లి: కాకర్లపల్లికి చెందిన పొదిలి నారాయణరావు(59) తన బైక్‌పై ఫ్యాన్సీ వస్తువులను విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పాత సెంటర్ వైపు వెళుతుండగా సత్తుపల్లి రింగ్ సెంటర్ వద్ద వెనక నుంచి లారీ ఢీకొంది. కిందపడిపోయిన ఆయన తలపై నుంచి లారీ టైర్ వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం శవాగారానికి తరలించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## డ్రగ్స్ కేసుల్లో 12 మంది నిందితుల అరెస్టు

హైదరాబాద్: సైబర్ సెక్యూరిటీ మాజీ ఇంజినీర్, వ్యాపారవేత్త, హోటల్ మేనేజర్, ప్రైవేటు ఉద్యోగులు.. ఇలా 12 మంది ఎట్టకేలకు తెలంగాణ ఈగల్‌కు చిక్కారు. వీరంతా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు ఈగల్ 2024, 2025లో కేసులు నమోదు చేసినా పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నారు. ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టి ఈగల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. హైదరాబాద్-3, సైబరాబాద్-2, రాచకొండ-2, ఖమ్మం-2, సిద్దిపేట, కరీంనగర్, వనపర్తి జిల్లాల్లో ఒక్కొక్కరి చొప్పున అరెస్టయ్యారు. వీరిలో కొచ్చిలోని ఓ కంపెనీకి చెందిన సైబర్ సెక్యూరిటీ మాజీ ఇంజినీర్ సాయి అక్షిత్(సరూర్‌నగర్), ఏసీ మెకానిక్ మల్లూరి యశ్వంత్(ఆదిభట్ల), ఫ్రీలాన్స్ హోటల్ మేనేజర్ అశ్విన్‌కుమార్(బోడుప్పల్), ప్రైవేటు ఉద్యోగి సయ్యద్ షాహిద్(పుప్పాలగూడ), ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన వేదాంత్ గుప్తా, రిషబ్, ఐటీ ఉద్యోగి షేక్ ఖాజా ఫరీదుద్దీన్(హైటెక్‌సిటీ), మహ్మద్ సమీర్ ఖాన్(గజ్వేల్), దుర్గం కృష్ణకుమార్(కరీంనగర్), ఖమ్మం జిల్లాకు చెందిన దుబ్బాకుల రామకృష్ణ(26), షేక్ ఖాసీం(28), వనపర్తికి చెందిన పాలెం వినయ్ ఉన్నారు.

## చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

సత్తుపల్లి: చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.4.50లక్షల జరిమానా విధిస్తూ స్థానిక కోర్టులో ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్ఎన్ సుమబాల గురువారం తీర్పుచెప్పారు. కల్లూరుకు చెందిన సిద్ధంశెట్టి మధుమోహన్‌రావు మండలంలోని రంగంబంజర్‌కు చెందిన పంచకర్ల శ్రీనివాసరావుకు 2013, నవంబరు 13న ప్రాంసరీ నోట్ హామీగా తీసుకుని రూ.4లక్షలు అప్పుగా ఇచ్చారు. 2014 డిసెంబరు 15న పార్ట్‌పేమెంట్ పేరుతో రూ.3లక్షలకు శ్రీనివాసరావు చెక్కు ఇవ్వగా అది బౌన్స్ అయ్యింది. సీనియర్ న్యాయవాది పిన్నం జానకిరామారావు ద్వారా బాధితుడు కోర్టులో కేసు వేశారు. పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో నెల అదనంగా జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు